# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ ఆదివారం 27-6-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 269 పేజీలు: 4 వెల: రూ.1/-


# పేదలకు ఇండ్లు కట్టించి ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ



హైదరాబాద్ , జూన్ 26:పేదల కోసం ఇండ్లు కట్టించి ఇస్తున్న కార్యక్రమం దేశంలో ఎక్కడా కూడా లేదని మంత్రి కేటీఆర్ అన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో రూ. 9 వేల కోట్లతో ఇండ్లు కట్టించి ఇస్తున్న నగరం భారతదేశంలో హైదరాబాద్ ఒక్కటేనని తెలిపారు. శనివారం హైదరాబాద్ అంబేడ్కర్ నగరంలో నూతనంగా నిర్మించిన 330 డబుల్ బెడ్ రూం ఇండ్లను మంత్రులు కేటీఆర్, మహముద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అంబేడ్కర్ నగర్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఇంత అద్భుతమైన ఇళ్లు నిర్మించి ఇస్తారని అనుకోలేదని స్థానికులు చెబుతున్నారని తెలిపారు. ఇదే స్థలంలో ప్రయివేటు అపార్ట్‌మెంట్ కట్టి ఉంటే కోటిన్నర అయి ఉండేదని, కానీ ఒక్క పైసా తీసుకోకుండా సీఎం కేసీఆర్ ఇళ్లు నిర్మించి ఇచ్చారని కేటీఆర్ పేర్కొన్నారు. ఇల్లు కట్టాలన్న, పెళ్లి చేయాలన్న కష్టంతో కూడుకున్న పని అని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం కేసీఆర్ ఇల్లు కట్టించి ఇచ్చి, ఆడ పిల్లల పెళ్లిళ్లకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. హైదరాబాద్ నగరంలో చెట్లు పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పచ్చదనాన్ని పెంచే బాధ్యతను ఆడబిడ్డలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ సాగర్ ఒకప్పుడు మురికికూపంగా ఉండేదని, ఇప్పుడిప్పుడే దాన్ని బాగు చేసుకుంటున్నామని తెలిపారు. సాగర్ పరిసరాల్లో చెత్త వేయనీయకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# సీఎస్ సోమేశ్‌కుమార్‌ను కలిసిన కోస్టారికా అంబాసిడర్

హైదరాబాద్ , జూన్ 26:కోస్టారికా అంబాసిడర్ క్లాడియో అన్సోరెనా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌ను శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నాయకత్వంలో రాష్ట్రం వ్యవసాయ, ఐటీ, ఫార్మా, పారిశ్రామిక రంగంలో గణనీయమైన పురోగతి సాధించిందని వివరించారు. గత 7 సంవత్సరాలుగా వ్యవసాయరంగంలో సాధించిన ప్రగతి, కాళేశ్వరం నీటి పారుదల ప్రాజెక్టు, కోవిడ్ నియంత్రణకు చేపట్టిన చర్యలను వివరించారు.

ఆయిల్ ఫామ్ సాగు, సాంకేతిక సహకారం, వ్యవసాయం తదితర రంగాలలో పరస్పర సహకారంతో పాటు, పామాయిల్ పరిశ్రమల పెట్టుబడులకు గల విస్తృత అవకాశాలపై చర్చించారు. ఎంఓయూ కుదుర్చుకొనే అంశాలపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, జాయింట్ సెక్రటరి ( ప్రొటోకాల్) అర్విందర్ సింగ్ లు పాల్గొన్నారు.

# నిర్దేశించిన ఏ పనీ పెండింగ్‌లో ఉండొద్దు: అధికారులకు సీఎం కీలక ఆదేశం



హైదరాబాద్ , జూన్ 26:తెలంగాణలో జులై 1వ తేదీ నుంచి చేపట్టనున్న పల్లె ప్రగతి, హరితహారంపై సీఎం కేసీఆర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. శనివారం ప్రగతిభవన్ లో కలెక్టర్లు, అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు.

జులై 1 నుంచి అమలు చేసే పల్లె, పట్టణ ప్రగతి, హరితహారం కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా, ఏడో విడత హరితహారం కార్యక్రమంలో అందుకోవాల్సిన లక్ష్యాలను నిర్దేశించారు. గ్రామాల్లో ఇంటింటికీ 6 మొక్కలు చొప్పున పంపిణీ చేయాలని తెలిపారు. నిర్దేశించిన ఏ పనీ పెండింగ్‌లోఉండేందుకు వీల్లేదని స్పష్టం చేశారు. ప్రజలను చైతన్యపరిచి శ్రమదానంలో పాల్గొనేలా చేయాలని సూచించారు.

కల్తీ విత్తనాల అమ్మకాల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అపరిష్కృతంగా ఉన్న పనులపై అధికారులు పునఃసమీక్ష చేయాలని సూచించారు. రాష్ట్రంలో మిల్లుల సంఖ్యను పెంచేందుకు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ప్రభుత్వ యంత్రాంగం అండగా నిలవాలని తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను తొలగించడానికి కృషి చేయాలన్నారు. రాష్ట్రానికి అదనపు రైస్ మిల్లులు అవసరం ఉందన్నారు. రైస్ మిల్లుల సంఖ్యను పెంచి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్ సూచించారు. 250 ఎకరాల్లో ఒక్కో ఫుడ్ ప్రాసెసింగ్ సెజ్ ఏర్పాటు చేయాలన్నారు. సెజ్‌ల చుట్టూ బఫర్ జోన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బఫర్ జోన్ల పరిధిలో లేఔట్లు, నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దన్నారు.

పోడు భూముల సమస్యలను పరిష్కరించేందుకు సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. ప్రజావసరాలకు కేటాయించిన భూమిని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయాలని స్పష్టం చేశారు. రికార్డుల్లో ఉన్న 66 లక్షల ఎకరాల అటవీ భూముల హద్దులను నిర్దిష్టంగా గుర్తించాలని సీఎం ఆదేశించారు.

# అయోధ్య నగరం ప్రతి భారతీయుడిది: ప్రధాని మోడీ



న్యూఢిల్లీ, జూన్ 26:అయోధ్య నగరం అందరిది అని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలు, మనం చేసే అభివృద్ధి ఫలాలు అయోధ్య నగర నిర్మాణంలో కనిపించాలని తెలిపారు. శనివారం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తో ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అయోధ్య నిర్మాణ పనుల్లో పురోగతిపై చర్చించారు. ఈ ఇద్దరూ ఇటీవల భేటీలో పాల్గొనడం ఈనెలలో రెండవసారి.

అయోధ్య అభివృద్ధి కోసం చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రణాళికలను సీఎం యోగి ప్రధానికి వివరించారు. మంచి రోడ్లు, మౌలిక వసతులు, రైల్వే స్టేషన్, ఎయిర్ పోర్ట్ వంటి సకల హంగులతో నగరాన్ని నిర్మిస్తున్నట్టు ప్రధానికి యోగి వివరించారు. ప్రతి భారతీయుడి సాంస్కృతిక కల అయోధ్య అని, దానికి తగ్గట్టే నిర్మాణముండాలని మోడీ తెలిపారు. అయోధ్య నగరంలో ఆధ్యాత్మికతతో పాటు అందం కూడా ఉట్టిపడాలన్నారు. భావి తరపు మౌలిక వసతులకు అనుగుణంగా మానవ విలువలూ ఉండాలని చెప్పారు.

కాగా, అయోధ్య రామ్ టెంపుల్ ట్రస్ట్‌పై అక్రమ భూ ఒప్పందంపై ఆరోపణలు వెలువడిన కొద్ది రోజులకే ప్రధాని, ముఖ్యమంత్రి మధ్య సమావేశం జరిగింది. రామ మందిరం నిర్మాణం కోసం దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున విరాళాలు సేకరించిన విషయం తెలిసిందే. గత ఏడాది అయోధ్యలో ప్రతిపాదిత రామ్ ఆలయానికి సంచలనాత్మక కార్యక్రమానికి ముందు, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఆలయ పట్టణాన్ని పెద్ద మత పర్యాటక కేంద్రంగా ప్రోత్సహించడానికి అనేక ప్రాజెక్టులను ప్రకటించింది. ప్రస్తుతానికి, అయోధ్యలో వివిఐపిల ఉపయోగం కోసం ఎయిర్‌స్ట్రిప్ ఉంది. అయితే దీన్ని విమానాశ్రయంగా మారుస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మెగా అప్‌గ్రేడ్ ప్లాన్‌లో పట్టణంలోని నీటి సరఫరా, బస్ స్టేషన్, పోలీసు బ్యారక్‌ల అప్‌గ్రేడ్ కూడా ఉన్నాయి. అయోధ్యను దేశంలోని అన్ని ప్రాంతాలకు అనుసంధానం చేయడం కోసం రూ.100 కోట్లతో అయోధ్య రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అయోధ్య విమానాశ్రయం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.321 కోట్లు విడుదల చేసింది. దీనికి మర్యాదా పురుషోత్తమ్ శ్రీరామ్ విమానాశ్రయంగా నామకరణం చేస్తారు.

# ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన మంత్రి పువ్వాడ

హైదరాబాద్ , జూన్ 26: ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కలిశారు. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలోని కారేపల్లి మండల కేంద్రంలో 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్‌కు మంత్రి పువ్వాడ వినతి పత్రం సమర్పించారు. సీఎంను కలిసిన వారిలో మంత్రి అజయ్ కుమార్‌తో పాటు వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ ఉన్నారు.

# సీఎం కేసీఆర్‌ను కలిసిన పీఆర్టీయూ నాయకులు

హైదరాబాద్ , జూన్ 26: ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పీఆర్టీయూ నాయకులు కలిశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఎంకు వారు వినతిపత్రం సమర్పించారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన క్యాడర్ విభజన పూర్తి చేసి పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ప్రారంభించాలని సీఎంను కోరారు. అలాగే, కరోనా పరిస్థితుల నేపథ్యంలో పాఠశాలల పున: ప్రారంభాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని, ఆన్‌లైన్‌లోనే విద్యాబోధన కొనసాగించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. 50శాతం ఉపాధ్యాయులు హాజరయ్యేలా ఆదేశించాలని సీఎం కేసీఆర్‌కు పీఆర్టీయూ నాయకులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్దన్ రెడ్డి, కూర రఘోత్తం రెడ్డి, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఈటల రాజేందర్‌పై ఎమ్మెల్యే బాల్క సుమన్ ఫైర్



కరీంనగర్ జూన్ 26(నేటినిజం ప్రతినిధి): బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్‌పై టీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

ఈటల రాజేందర్‌ను ఇక నుంచి వెన్నుపోటు రాజేందర్‌గా పిలవాలని పిలుపునిచ్చారు. హుజురాబాద్ మండలంలోని 19 గ్రామాల టీఆర్ఎస్ కార్యకర్తలతో బీఎస్సార్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సోషల్ మీడియా సమావేశానికి ముఖ్య అతిథిగా బాల్క సుమన్ హాజరై ప్రసంగించారు.

సీఎం కేసీఆర్‌కు ఈటల రాజేందర్ రాసిన లేఖ నిజమైందేనని, కానీ బీజేపీ ఫేక్ లేఖగా చిత్రీకరించి ప్రచారం చేస్తుందన్నారు. బండి సంజయ్‌కు దమ్ముంటే ఆ లేఖ ఫేక్ అని హైదరాబాద్ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద ప్రమాణం చేయగలరా? అని సవాల్ విసిరారు.

ఈటల రాజేందర్ తెలంగాణ ఆత్మాభిమానాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టి, ఢిల్లీ దొరల దగ్గర మోకరిల్లాడు అని ధ్వజమెత్తారు. ఈటల ఇక నుంచి బీజేపీ రాజేందర్‌గానే మిగిలిపోతారు అని పేర్కొన్నారు. తనకున్న 200 ఎకరాల్లో.. ఒక్కో ఎకరం అమ్మి ఒక్కో ఎన్నికలో ఖర్చు పెట్టి గెలుస్తానని ఈటల చెప్పారు. ఆ డబ్బు సంచులతో వచ్చే బీజేపీ నాయకులతో జాగ్రత్తగా ఉండాలని సుమన్ సూచించారు. హుజురాబాద్ ఉప ఎన్నిక పూర్తయ్యే వరకు అక్కడే ఉంటానని బాల్క సుమన్ స్పష్టం చేశారు

# ప్రాణవాయువు కొరత లేకుండా చేద్దాం!

న్యూఢిల్లీ : దేశ రాజధానిలో ఆక్సిజన్ అవసరాలను నాలుగు రెట్లు పెంచి చూపారనే నివేదిక నేపథ్యంలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేయాలని కాంగ్రెస్, బీజేపీ చేసిన డిమాండ్‌ను ఆప్ నేతలు తోసిపుచ్చారు. ఇక థర్డ్ వేవ్ తలెత్తితే ఆక్సిజన్ కొరతతో ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా చూడాలని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఆక్సిజన్ కోసం మన పోరాటం ముగిసిందని భావిస్తే థర్డ్ వేవ్‌లో ఆక్సిజన్ లేకుండా ఏ ఒక్కరూ బాధపడకూడని పరిస్థితిని కల్పించేలా మనం కసరత్తు సాగించాలని ఢిల్లీ సీఎం పిలుపు ఇచ్చారు. సెకండ్ వేవ్‌లో పెద్దసంఖ్యలో కరోనా రోగులు ఆక్సిజన్ కొరతతో ఇబ్బంది పడగా, థర్డ్ వేవ్‌లో ఇలాంటిది జరగరాదని అన్నారు. మనలో మనం కీచులాడుకుంటే కరోనా విజయం సాధిస్తుందని, మనం కలిసికట్టుగా పోరాడితే మహమ్మారి తోకముడిచి దేశం గెలుస్తుందని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. కాగా కరోనా సెకండ్ వేవ్ ముమ్మర దశలో ఉన్న సమయంలో ఢిల్లీ ప్రభుత్వం తన ఆక్సిజన్ అవసరాలను నాలుగింతలు అధికంగా చూపిందని సుప్రీంకోర్టు నియమించిన ఆడిట్ కమిటీ నివేదిక పేర్కొనడం కలకలం రేపింది. ఢిల్లీ తీరుతో ఆ సమయంలో అత్యధిక కేసులు వెలుగుచూసిన 12 రాష్ట్రాలు ఆక్సిజన్ సరఫరాల్లోతీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.

# కోటి డోసులు అందించిన వైద్యారోగ్య శాఖకు గవర్నర్ శుభాకాంక్షలు

హైదరాబాద్ , జూన్ 26: రాష్ట్రంలో కోటి డోసులు అందించిన వైద్యారోగ్య శాఖకు గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో లక్ష్యం మేరకు టీకా కార్యక్రమం కొనసాగుతున్నదని చెప్పారు. నగరంలోని వెంగళ్‌రావునగర్‌లో ఏర్పాటు చేసిన కొవిడ్ కమాండ్ సెంటర్‌ను గవర్నర్ తమిళిసై సందర్శించారు. కొవిడ్ కమాండ్ సెంటర్ ఏర్పాటు ప్రభుత్వ గొప్ప ఆలోచన అని ప్రశంసించారు. ఇందులో ఉన్న వార్ రూమ్, కాల్ సెంటర్ ద్వారా అవసరమైనవారికి వైద్య సేవల సాయం అందిస్తున్నారని చెప్పారు. కరోనా మూడో దశను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు.కరోనా మూడో వేవ్‌ను ఎదుర్కోవడానికి సన్నద్ధతలో భాగంగా.. వెంగళ్‌రావునగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్‌లో కొవిడ్ కమాండ్ సెంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిని మంత్రి కేటీఆర్ నిన్న ప్రారంభించారు. ఇందులో కమాండ్ సెంటర్, కాల్ సెంటర్, టెలిమెడిసిన్ ఉన్నాయి.

# ఆన్ లైన్‌లోనే తరగతులు: తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు



హైదరాబాద్ , జూన్ 26:తెలంగాణలో జులై 1 నుంచి విద్యాసంస్థలు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో కరోనా సెకండ్ వేవ్ ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్‌లోనే పాఠశాలల తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పట్లో ప్రత్యక్ష బోధనకు తొందరేమీ లేదని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. వెంటనే ఆన్ లైన్ క్లాసులకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేయాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి సీఎం ఆదేశించారు.

50 శాతం ఉపాధ్యాయులు హాజరయ్యేలా చూడాలని నిర్దేశించారు.

ఇటీవలే తెలంగాణలో కరోనా వైరస్ తగ్గడంతో లాక్ డౌన్ ఆంక్షలు ఎత్తివేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం జులై 1 నుంచి విద్యాసంస్థల ప్రారంభానికి అనుమతిచ్చింది. కానీ స్కూళ్లలో ప్రత్యక్ష బోధన సాగుతుందా? ఆన్ లైన్ బోధనా? అనేది స్పష్టత ఇవ్వలేదు. తాజాగా సీఎం కేసీఆర్ ప్రకటనతో ఆన్ లైన్ బోధనే అనేది స్పష్టమైంది.

కాగా, ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పీఆర్టీయూ నాయకులు కలిశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఎంకు వారు వినతిపత్రం సమర్పించారు

. కొత్త జిల్లాల ప్రాతిపదికన క్యాడర్ విభజన పూర్తి చేసి పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ప్రారంభించాలని సీఎంను కోరారు. అలాగే, కరోనా పరిస్థితుల నేపథ్యంలో పాఠశాలల పున: ప్రారంభాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని, ఆన్‌లైన్‌లోనే విద్యాబోధన కొనసాగించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. 50శాతం ఉపాధ్యాయులు హాజరయ్యేలా ఆదేశించాలని సీఎం కేసీఆర్‌కు పీఆర్టీయూ నాయకులు విన్నవించారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ కనబడు లక్ష్యము జేరగ
వెనుచూచుట నెరుగనట్టి "పి.టి.ఉష" పై
జనవందనముండు భవుడు - హరి
పెను సంతస మొప్పు రీతి చిరమగు యశమున్ !!

-రాధశ్రీ



( జూన్ 27 పరుగుల రాణి పీటీ ఉష పుట్టిన రోజు...)

సెల్: 9494481210

# బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షల తేదీలు ఖరారు

హైదరాబాద్ , జూన్ 26:తెలంగాణలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలో ఆయా పరీక్షల తేదీలు ఖరారు అయ్యాయి. డిగ్రీ, ఎంబీఏ ఎగ్జామ్స్‌తో పాటు బీఎడ్ ప్రవేశ పరీక్ష తేదీలను ఖరారు చేస్తూ యూనివర్సిటీ అధికారులు ప్రకటన చేశారు. డిగ్రీ (సీబీసీఎస్ ) 4వ సెమిస్టర్ ఎగ్జామ్స్ జులై 6 నుంచి 8వ తేదీ వరకు, డిగ్రీ 2వ సెమిస్టర్ పరీక్షలను జులై 9 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

మూడేళ్ల డిగ్రీ కోర్సు పాత బ్యాచ్‌ల పరీక్షలను జులై 16 నుంచి ఆగస్టు 1 వరకు నిర్వహించనున్నారుబీఎడ్ ( స్పెషల్ ఎడ్యుకేషన్ ) ప్రవేశ పరీక్షను జులై 18న, ఎంబీఏ ( హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) పరీక్షలను జులై 16 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

పరీక్షల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు వర్సిటీ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

# తెలంగాణలో నేడు భారీ వర్షాలు

హైదరాబాద్ , జూన్ 26:తెలంగాణలో పలు జిల్లాల్లో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఝార్ఖండ్ నుంచి ఒడిశా వరకు 900 మీటర్ల ఎత్తున గాలులతో ఉపరితల ద్రోణి వ్యాపించి ఉంది. దీంతో పశ్చిమ, వాయవ్య భారత ప్రాంతాల నుంచి తెలంగాణ వైపు తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో శనివారం రాష్ట్రంల్లోని పలు జిల్లాల్లో ఓ మాదిరి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇక ఆదివారం తూర్పు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

నైరుతి రుతుపవనాలు ఈ నెల 4న తెలంగాణను తాకాయి. దీంతో తొలకరి వర్షాలు కురిశాయి. అయితే, ఆ తర్వాతి నుంచి వర్షాలు జాడే లేకుండాపోయింది. చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. రుతుపవనాల్లో కదలికలు లేక వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. తెలంగాణలోని పలు జిల్లాల్లో 35 డిగ్రీల కంటే ఎక్కువే ఉష్ణోగ్రత నమోదైంది.

# మాదన్నపేట చెరువులో బోటింగ్ ప్రారంభం



వరంగల్ రూరల్, , జూన్ 26:: నర్సంపేట మండలంలోని మాదన్నపేట చెరువులో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి బోటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాదన్నపేట చెరువులోకి గోదావరి జలాలను తీసుకొస్తామని ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని అన్నారు. ఈ చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం పర్యాటక శాఖ ఇక్కడ బోటింగ్ వసతి కల్పించినట్లు పేర్కొన్నారు. మాదన్నపేట చెరువును మినీ ట్యాంకుబండ్ గా తీర్చిదిద్దేందుకు రూ.4 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ఈ ఏడాది పనులు కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ రజిని, వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డితో పాటు కౌన్సిలర్లు, స్థానిక స్థానిక ప్రజా ప్రతినిధులు, టూరిజం శాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# డెల్టా ప్లస్ కూడా ప్రమాదకరమే : ఐసీఎంఆర్ మాజీ శాస్త్రవేత్త

న్యూఢిల్లీ, జూన్ 26: డెల్టా ప్లస్ వేరియంట్ పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని ఐసీఎంఆర్ మాజీ శాస్త్రవేత్త రమన్ గంగాఖేద్కర్ తెలిపారు. కరోనా వైరస్‌కు చెందిన డెల్టా వేరియంట్ చాలా విస్తృతంగా వ్యాప్తి చెందిందని, ఆ వేరియంట్‌ను ఆందోళనకరంగా గుర్తించామన్నారు. అలాగే డెల్టా ప్లస్ వేరియంట్‌ను కూడా ప్రమాదకరంగా భావించాలని గంగాఖేద్కర్ అభిప్రాయపడ్డారు. ఇండియాలో ఇప్పటి వరకు డెల్టా ప్లస్ వేరియంట్‌కు చెందిన 50 కేసులను గుర్తించారు. మరో వైపు కేంద్ర ఆరోగ్యశాఖ కూడా అన్ని రాష్ట్రాలకు వార్నింగ్ ఇచ్చింది. డెల్టా ప్లస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.వైరస్ వ్యాప్తి పట్ల నిబంధనలు కఠినంగా పాటించాలన్నది.

# టీఆర్ఎస్ వెంటే హుజురాబాద్ ప్రజలు : ఎమ్మెల్యే రవిశంకర్



కరీంనగర్, జూన్ 26: హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు టీఆర్ఎస్ పార్టీ వెంటే ఉన్నారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. ఇల్లంతకుంట మండలం బూర్జునూర్ లో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్.. జిల్లా పరిషత్ చైర్మన్ కనుమల్ల విజయ, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణ రావుతో కలిసి మీడియాతో మాట్లాడారు.

ఈటెల రాజేందర్ నుంచి హుజురాబాద్ ప్రజలకు విముక్తి కలిగిందన్నారు. నియోజకవర్గంలో అన్ని సమస్యలను సీఎం కేసీఆర్ పరిష్కరించారు అని స్పష్టం చేశారు. సొంత తమ్ముడి వలే ఈటలను సీఎం కేసీఆర్ అక్కున చేర్చుకుని పార్టీలో ఉన్నతమైన స్థానాన్ని కల్పించారు. 2004లో అనేకమంది ఎమ్మెల్యే అభ్యర్థులు ఉన్నప్పటికీ.. విద్యావంతుడు, బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి అని, కమ్యూనిస్టు భావాలు కలిగిన వ్యక్తి అని ఈటలకు కేసీఆర్ టికెట్ ఇచ్చి గెలిపించారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చినా బీజేపీలో చేరడం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్నాయని ఎమ్మెల్యే రవి శంకర్ పేర్కొన్నారు.

# ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో టికెట్ల బుకింగ్ కోసం ఈ కార్డ్స్ లింక్ చేయాల్సిందే..

న్యూఢిల్లీ, జూన్ 26:రైలు టికెట్లు బుకింగ్ కోసం ఇదివరకు ప్రయాణికులు గంటల కొద్దీ కౌంటర్ల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఉండేది. దీన్ని నివారించడానికి ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన తరువాత ఆ పరిస్థితి తప్పింది. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని అప్‌గ్రేడ్ చేసింది రైల్వే మంత్రిత్వ శాఖ. ఫలితంగా– ఉన్నచోటే స్మార్ట్‌ఫోన్ల ద్వారా రైల్వే టికెట్లను నిమిషాల్లో బుక్ చేసుకునే వెసలుబాటును ప్రయాణికులకు కల్పించింది.

దేశంలో అత్యధిక మంది యూజర్లు వినియోగించే వెబ్‌సైట్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. దీన్ని కూడా దుర్వినియోగం చేస్తున్నారు కొందరు. టికెట్లను బ్లాక్‌లో విక్రయించుకోవడానికి ఈ సౌకర్యాన్ని కూడా వదలట్లేదు. దీన్ని నివారించడానికి రైల్వే మంత్రిత్వ శాఖ కొత్త ప్రయోగానికి పూనుకున్నది. టికెట్లను బుక్ చేసుకోదలిచిన ప్రయాణికుల గుర్తింపు కార్డులతో ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌ను లింక్ చేయాలని భావిస్తోంది. దీనికి సంబంధించిన చర్యలను ప్రారంభించామని కూడా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ అరుణ్ కుమార్ తెలిపారు.

# అంధత్వాన్ని జయించిన అద్వితీయ మహిళామణి హెలెన్ కెల్లర్

(దివ్యాంగురాలు హెలెన్ కెల్లర్ జన్మదినం 27 జూన్ సందర్భంగా)

అమెరికన్ హెలెన్ కెల్లర్ ప్రఖ్యాత రచయిత, అంగవైకల్య హక్కుల పరిరక్షణ న్యాయవాది, రాజకీయ కార్యకర్త, పౌర హక్కుల పరిరక్షకురాలు, శ్రామికవర్గ పక్షపాతి మరియు ఉపన్యాసకురాలు స్వతహాగా చిరుప్రాయంలోనే బ్రెయిన్ ఫీవర్ కారణంగా కంటి చూపును కోల్పోయి, చెవిటితనంతో తన జీవితాన్ని అందరికీ ఆదర్శప్రాయంగా కొనసాగించారు. 27 జూన్ 1880న అమెరికా అలబామాలో కేట్ ఆడమ్స్, కల్నల్ ఆర్థర్ కెల్లర్ దంపతులకు జన్మించిన హెలెన్ కెల్లర్ రెండవ ఏటనే కంటి చూపును మరియు వినికిడిని కోల్పోయారు. తన ఏడవ ఏట గురువు అన్నే సుల్లివన్ సహాయంతో చదవడం, వ్రాయడం నేర్చుకోవడం ప్రారంభించారు. వినికిడ సమస్యల పట్ల కృషి చేస్తున్న గ్రాహం బెల్, టెలిఫోన్ అవిష్కర్తను కలిసి సూచనలు పొందారు. 1894లో 'రైట్–హుమాసన్' మరియు 'హోరేస్ మన్' బధిరుల పాఠశాలలో విద్యాభ్యాసం ప్రారంభించారు. 1896లో 'కేంబ్రిడ్జ్ స్కూల్ ఫర్ లేడీస్'లో చేరి విద్యార్జన కొనసాగించారు. 1904లో తన 24వ ఏట హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పొందిన ప్రథమ చెవిటి, కంటి చూపు లేని మహిళగా రికార్డు సాధించారు. తన గురువు అన్నా సుల్లివన్‌ను 1905లో వివాహమాడిన హెలెన్ 1924 – 68 కాలంలో 'అమెరికన్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్' వేదికగా అమెరికాతో పాటు 35 దేశాలు పర్యటించి అంధుల సమస్యల పట్ల బహుళ ప్రచారాలు నిర్వహించారు. ప్రముఖ అమెరికన్ రచయితగా 14 పుస్తకాలు, వందల కొద్ది ఉపన్యాసాలు, 500లకు పైగా వ్యాసాలు రచించిన హెలెన్ కెల్లర్ జంతువుల నుంచి మహాత్మాగాంధీ వరకు అనేక అంశాలను స్పృశించారు. దివ్యాంగుల పక్షపాతిగా కెల్లర్ జీవితాంతం అవిశ్రాంతంగా శ్రమిస్తూనే కార్మిక హక్కులు, మహిళా వికాసం, ప్రపంచ శాంతి విషయాల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేశారు.

'అమెరికన్ సివిల్ లిబర్టీస్'లో సభ్యత్వం తీసుకొని అవిశ్రాంతంగా శ్రమించారు. 1909లో అమెరికా సోషలిస్ట్ పార్టీలో చేరారు. 1903లో తన 22వ ఏటనే ఆత్మకథ 'ది స్టోరీ ఆఫ్ మై లైఫ్' రచించి ప్రపంచ దృష్టిని ఆకర్షించగలిగారు. దీనితో పాటుగా 'ఆప్టిమిజమ్', 'ది వరల్డ్ ఐ లివ్ ఇన్', 'మై రిలిజియన్', 'హెలెన్ కెల్లర్స్ జర్నల్', 'ది ఓపెన్ డోర్' లాంటి పలు పుస్తకాలు రచించారు. 27 జూన్ రోజున అమెరికా 'హెలెన్ కెల్లర్ దే'గా పాటించుట జరుగుతున్నది. 1971లో 'అలబామా ఉమెన్ హాల్ ఆఫ్ ఫేమ్'గా ఖ్యాతిని గడించారు. 1964లో నాటి అమెరికా అధ్యక్షుడు లిండన్ బి జాన్సన్ చేతుల మీదుగా 'ప్రెసిడెన్సియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్' అత్యుత్తమ పౌర పురస్కారం పొందారు. కెల్లర్ 87వ ఏట 01 జూన్ 1968న తుది శ్వాస విడిచారు. అతి చిరుప్రాయంలోనే వినికిడి మరియు కంటి చూపు కోల్పోయిన హెలెన్ కెల్లర్ నిరాశ చెందకుండా ప్రజలతో కమ్యునికేట్ చేసుకోగలగడం, చేతి వేళ్ళతో సైగల భాష నేర్చుకోవడం, ఇతరుల పెదవుల కదలికలను (టచ్–లిప్ రీడింగ్) చేతులతో స్పృశిస్తూ అర్థం చేసుకోగలగడం, టైప్ చేయగలగడం, ఫింగర్–స్పెల్లింగ్, బ్రెయిలీ లిపి లోతులు తెలుసుకోగలగడం లాంటి విలక్షణతలతో బంధిరులకు, అంధులకు ఆత్మవిశ్వాసం నింపగలిగారు. చెవిటితనం, అంధత్వంతో బాధ పడే దివ్యాంగుల చికిత్స నిమిత్తం వి 2 మిలియన్ల నిధులను 'అమెరికన్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్' సంస్థకుహెలెన్ కెల్లర్ సేకరించగలిగారు. జీవిత చరిత్రను 'ది మిరకిల్ వర్కర్' పేరున చలన చిత్రంగా తీయగా, దానికి 'పులిట్జర్ ప్రైజ్'తో పాటు రెండు అకాడమీ అవార్డులు రావడం జరిగింది.

30 జూన్ 1925న అంచర్జాతీయ లయన్స్ సంస్థ సమావేశంలో మాట్లాడుతూ అంధత్వంతో చీకట్లో జీవిస్తున్న అభాగ్యుల పాలిట చూపును ప్రసాదించే సేవకులుగా అంధత్వ నివారణకు (నైట్స్ ఆఫ్ బ్లైండ్) కృషి చేయాలని లయన్స్ స్వచ్ఛంద సేవకులను కోరారు. ఈ పిలుపును తీసుకున్న లయన్స్ అంతర్జాతీయ సంస్థ తమ కార్యాచరణలో అంధత్వ నివారణకు పెద్ద పీట వేస్తూ నేటికి కృషి చేయడం జరుగుతున్నది. కెల్లర్ ప్రతిభను గుర్తించిన అమెరికన్ అధ్యక్షులు 'గ్రోవర్ క్లీవ్లాండ్' నుంచి 'లిన్డన్ జాన్సన్' వరకు అందరూ తమ నివాసం 'వైట్ హౌజ్'కు ప్రత్యేకంగా ఆహ్వానించడం విశేషం. అమెరికన్ ప్రథమ 'గుడ్‌విల్ అంబాసిడర్ టు జపాన్'గా నియమింపబడిన హెలెన్ కెల్లర్ జీవితం దివ్యాంగులకే కాకుండా సాధారణ ప్రపంచ మానవాళికి కూడా ఆదర్శంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. 'సూర్యకిరణాలను చూసే వారికి తమ నీడ కనిపించదు' అనే నినాదంతో తన జీవిత లక్ష్యాలను ఛేదించుటలో వైకల్యం అడ్డురాలేదని రుజువు చేసిన హెలెన్ కెల్లర్ ప్రతిభ అసామాన్యం, తన మానవీయ కోణం అనుసరణీయం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# జల చౌర్యం ఆపండి.. లేదంటే యుద్ధమే: ఏపీకి తెలంగాణ మంత్రి వార్నింగ్



అమరావతి, జూన్ 25:ఆంధ్రప్రదేశ్ నీటి చౌర్యాన్ని తప్పకుండా అడ్డుకుంటామని మంత్రి పువ్వాడ అజయ్ స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల ప్రజలు బాగుండాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారని చెప్పారు. బేసిన్లు, భేషజాలకు పోకుండా న్యాయం చేద్దామని, గోదావరి జలాలను సమృద్ధిగా వినియోగించుకుందామని కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. రాయలసీమకు నీళ్లు ఇస్తామనే మాటలను ఏపీ వక్రీకరిస్తున్నదని ఆరోపించారు. రెండు రాష్ట్రాల నీటి వాటాలు ఇంకా తేలలేదని తెలిపారు. వైఎస్‌పై మంత్రి ప్రశాంత్‌రెడ్డి మాటలు వంద శాతం నిజమని చెప్పారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం తాము మాట్లాడుతున్నామన్నారు. వైఎస్ హయాంలో అద్భుతమైన ప్రాజెక్టులు కట్టామని చెబుతున్నారని, ఖమ్మం జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీరు వచ్చిందా అని ప్రశ్నించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి తెలంగాణలో ఒక్క ప్రాజెక్ట్ కూడా కట్టలేదని చెప్పారు.

తెలంగాణ పట్ల తండ్రికి మించిన తనయుడు జగన్మోహన్ రెడ్డి అని ఆగ్రహం వ్యక్తంచేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తెలంగాణ సమాజాన్ని చిన్నచూపు చూశారన్నారు. పోతిరెడ్డిపాడు అంశపై తెలంగాణ ఉద్యమం సందర్భంగా కేసీఆర్ పోరాటం చేశారన్నారు. కేంద్రానికి అబద్ధాలు చెబుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సన్నాయి నొక్కులు నొక్కుతున్నదని విమర్శించారు. బీజేపీ నేతలు ఏపీలో ఒకలా, తెలంగాణలో మరోలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎన్జీటీ తీర్పును ఏపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సీఎం కేసీఆర్ మాటలకు వక్రభాష్యం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రిబున్యల్ వెంటనే ఇరు రాష్ట్రాల నీటివాటాను తేల్చాలని డిమాండ్ చేశారు.

# హుజురాబాద్‌లో ఉప ఎన్నిక వేడి.. కాంగ్రెస్ లైట్ తీసుకుందా?



న్యూఢిల్లీ, జూన్ 26:హుజురాబాద్ ఉప ఎన్నిక రాజకీయ వేడి పెంచుతోంది. టీఆర్ఎస్, బీజేపీలు ఢీ అంటే ఢీ అంటున్నాయి. అయితే, కాంగ్రెస్ పార్టీ మాత్రం హాయిగా దుప్పటి కప్పుకుని ఇంట్లో కూర్చుంది. హుజురాబాద్‌కు రేపో మాపో నోటిఫికేషన్ రానుందని తెలిసినా కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ సైలెంట్‌గా ఉంది. హుజురాబాద్ ఉప ఎన్నికను కాంగ్రెస్ పార్టీ లైట్ తీసుకుందా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హుజురాబాద్ లో గెలుపు కోసం ఇటు టీఆర్ఎస్, అటు బీజేపీ పార్టీలు పక్కా వ్యూహాలతో ప్రచారం చేస్తున్నాయి. ఇప్పటికే ఇరు పార్టీలకు చెందిన నాయకులు వరుస పర్యటనలతో దూసుకుపోతున్నారు. కానీ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఉలకు పలుకు లేకుండా ఉండటం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. వరుస ఓటములతో వైరాగ్యం కలిగిందో లేక.. ఎలాగూ గెలవలేమని ఫిక్స్ అయ్యారో ఏమో ఒక్కరంటే ఒక్కరు హుజురాబాద్ వైపే చూడడం లేదు.రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన ప్రతి ఎన్నికలోనూ కాంగ్రెస్ పార్టీకి వరుస ఓటములు ఎదురవుతున్నాయి. దీంతో పార్టీ నాయకులు నిరాశలో ఉన్నారు. తెలంగా ణలో ఏ ఎన్నిక జరిగినా రేవంత్, కోమ టిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు ప్రచారాన్ని ముందే మొదలు పెడతారు. గతంలో దుబ్బాక, నాగార్జునసాగర్ ఉప ఎన్నికలో నోటిఫికేషన్ కంటే ముందే ప్రచారంలో చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలోనూ తీవ్రంగా శ్రమించారు. అయితే హుజురాబాద్‌కు వచ్చే సరికి మాత్రం కాంగ్రెస్ పార్టీ నాయకులు చేతులెత్తేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రస్తుత కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ వంటి నేతలు కూడా కనీసం హుజురాబాద్ వైపు చూడకపోవడం.. కాంగ్రెస్ శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తోంది.

నిజానికి హుజురాబాద్‌లో టీఆర్ఎస్ పార్టీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి ఈటలకు కాంగ్రెస్ పార్టీ గట్టి పోటీ ఇచ్చింది. బీజేపీకి నోటాకు వచ్చిన ఓట్లు కూడా రాలేదు. కానీ ఇప్పుడు సీన్ మారింది. మాజీ మంత్రి ఈటల బీజేపీలో చేరడంతో కాషాయ పార్టీ బలపడింది. ఉప ఎన్నిక రాబోతోందన్న స్పృహే కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో కనిపించడం లేదు. టీఆర్ఎస్, బీజేపీ ఇప్పటికే మండలాల వారీగా ఇంచార్జ్‌లను కూడా మొహరిస్తే? కాంగ్రెస్ మాత్రం తాత్సారం చేస్తోంది.

మరోవైపు తెలంగాణ పీసీసీ చీఫ్‌ను పార్టీ హైకమాండ్ ఇప్పటి వరకు ఇంకా ఎంపిక చేయలేదు. రేవంత్ రెడ్డిని ఎంపిక చేశారని ప్రచారం జరుగుతున్నా? ఆయన పేరును మాత్రం అధికారికంగా ప్రకటించ లేదు. కొత్త సారథి పేరును ప్రకటించకుండా ఇంకా నాన్చుతుండటంతో.. ఎవరు ముందడుగు వేయాలన్నది తేల్చుకోలేకపోతున్నారు. ఎలాగు అధ్యక్ష పదవి నుంచి దిగిపోతున్నానని ఉత్తమ్ లైట్ తీసుకుంటున్నట్టు కనబడితే.. ఎవరి పేరు ప్రకటిస్తారో తెలియదన్న డైలామాతో మిగిలిన వారూ ముందడుగు వేయడం లేదు. దీంతో కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేసిన తర్వాతే హుజురాబాద్ ఉప ఎన్నిక ప్రచారంలోకి దిగాలని ఆపార్టీ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉంటే ఉప ఎన్నికలో ఈటలపై కాంగ్రెస్ తరపున ఎవరు పోటీ చేస్తారు? అన్నది కూడా సస్పెన్స్ గా మారింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున పోటీ చేసిన పాడి కౌశిక్ రెడ్డి ఇటీవల మంత్రి కేటీఆర్‌తో భేటీ కావడంతో ఆయన పోటీ పై అనుమానాలు నెలకొన్నాయి. తాను టీఆర్ఎస్‌లోకి వెళ్లేది లేదని ఎంత వివరణ ఇచ్చినా.. ఏక్షణమైనా ఆయన గులాబీ కండువా కప్పుకుంటారేమోనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తం మీద కాంగ్రెస్ పార్టీకి హుజురాబాద్ ఉప ఎన్నికల చావో రేవో అన్నట్లు మారింది.

# 43,71,650 మొక్కలు నాటడమే లక్ష్యం

### –7వ విడుత తెలంగాణకు హరిత హారం పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లి జంక్షన్, జూన్ 25: ఏడో విడుత హరితహారం నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతున్నది. ఇప్పటికే మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వే ప్రక్రియ ముమ్మరంగా సాగుతున్నది. లక్ష్యం మేరకు నర్సరీల్లో మొక్కలను పెంచారు. పండ్లు, కలప, నీడ, అలంకరణ, పువ్వులనిచ్చే మొక్కలను నాటనున్నారు. 7వ విడుత తెలంగాణకు హరిత హారానికి సంబంధించి గ్రామీణాభివృద్ధి శాఖ, తెలంగాణ ప్రభుత్వం ముద్రించిన పోస్టర్లను కలెక్టర్ డాక్టర్ సర్వే సంగీత సత్యనారాయణ, తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 7వ విడుత హరిత హార జిల్లా లక్ష్యం 43, 71, 650 అని వెల్లడించారు. గ్రామీణాభివృద్ధి, అటవీ, పురపాలక, పరిశ్రమల శాఖలు, సింగరేణి, ఎన్టీపీసీ సంస్థల ఆధ్వర్యంలో మొ క్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించామని వివరించారు.

ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యం మేరకు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వీ లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్, డీఎఫ్‌వో రవిప్రసాద్, డీఆర్డీవో శ్రీధర్, డీపీవో చంద్రమౌళి పాల్గొన్నారు.

# డెల్టా ప్లస్‌పై ప్రభావవంతంగా పనిచేయనున్న కొవ్యాక్సిన్, కొవిషీల్డ్

న్యూఢిల్లీ, జూన్ 26:డెల్టా ప్లస్ వేరియంట్‌పై దేశీ వ్యాక్సిన్ల ప్రభావాన్ని పరిశీలిస్తున్నామని వారం పదిరోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బలరాం భార్గవ పేర్కొన్న క్రమంలో ఈ దిశగా తీపికబురు అందింది.డెల్టా ప్లస్ వేరియంట్‌పై ఈ రెండు వ్యాక్సిన్లు సమర్ధంగా పనిచేస్తాయని ఒడిషాకు చెందిన ఆరోగ్య నిపుణులు డాక్టర్ నిరోజ్ మిశ్రా పేర్కొన్నారు. భారత్‌లో వాడుతున్న రెండు కరోనా వ్యాక్సినుా?ల డెల్టా ప్లస్ వేరియంట్‌పైనా పనిచేస్తాయని తాజా అధ్యయనాల్లో వెల్లడైందని బ్రిటన్ నుంచి వెలువడిన వార్తా కథనం వెల్లడించిందని డాక్టర్ మిశ్రా తెలిపారు.

డెల్టా ప్లస్ వేరియంట్‌పై ఆందోళన అవసరం లేదని, మెరుగైన ప్రజారోగ్య వసతులతో మహమ్మారిని ఎదుర్కోవచ్చని చెప్పారు. ఒడిషాలో తొలి డెల్టా ప్లస్ వేరియంట్ కేసు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో డాక్టర్ మిశ్రా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మరోవైపు డెల్టా ప్లస్ వేరియంట్‌పై కొవిషీల్డ్, కొవ్యాక్సిన్ల సామర్థ్యం గురించి పరీక్షిస్తున్నామని ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బలరాం భార్గవ వెల్లడించారు. డెల్టా ప్లస్ వేరియంట్ ప్రస్తుతం 12 దేశాల్లో వ్యాపిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇక భారత్‌లోని పది రాష్ట్రాల్లో 48 కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం అవి ఆ ప్రాంతానికే పరిమితమయ్యాయని చెప్పారు.

# కాళేశ్వరం జలసవ్వడులు.. ప్రాజెక్టు నుంచి జోరుగా ఎత్తిపోతలు



హైదరాబాద్ , జూన్ 26:ప్రతిష్ఠాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. లింక్–1 లక్ష్మి పంపుహౌస్‌లోని 12పంపులను ఆన్ చేసి 25,200 క్యూసెక్కుల నీటిని ఎగువన గల సరస్వతీ బరాజ్‌లోకి తరలిస్తున్నారు. ఇక్కడి సరస్వతీ పంపు హౌస్‌లోని తొమ్మిది పంపులను ఆన్ చేసి 26,370 క్యూసెక్కుల నీటిని పార్వతీ బరాజ్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఇక్కడ పార్వతీ పంపుహౌస్‌లోని 10పంపులను ఆన్ చేసి 26,100 క్యూసెక్కుల నీటిని ఎల్లంపల్లి జలాశయంలోకి ఎత్తిపోస్తున్నారు. అలాగే ధర్మారం మండలం నంది మేడారంలోని లింక్–2లోని తొలి పంపు హౌస్ నందిలో ఏడు పంపులకు గానూ ఆరింటిని ఆన్‌చేసి 18,900 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఇక్కడి నుంచి కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంపు హౌస్‌లో ఆరు పంపులను ఆన్ చేసి 18,900 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

# ఆడబిడ్డల సంతోషమే సర్కారు ధ్యేయం

**సీఎం కేసీఆర్‌తోనే మహిళా సాధికారత**
**రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్**
**హుజూరాబాద్‌లో సమాఖ్య సంఘాలతో సమావేశం**
**19 సంఘాలకు రూ.95 లక్షల బకాయి చెక్కుల పంపిణీ**
**మహిళా భవనానికి రూ.50 లక్షలు మంజూరు**

హుజూరాబాద్‌టౌన్, జూన్ 26:హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని 19 సమాఖ్య సంఘాల బకాయిలు 95 లక్షలను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో మంత్రి గంగుల కమలాకర్ మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. త్వరలోనే మిగిలిన బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఆడబిడ్డలకు ఏ కష్టం రాకుండా చూసుకుంటామని భరోసానిచ్చారు.

ఆడబిడ్డల సంతోషమే సర్కారు ధ్యేయమని, వారికి ఏ కష్టం కలుగకుండా వడ్డీలేని రుణాలు, కల్యాణలక్ష్మి, పొదుపు సంఘాల రుణాలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఇంత చేస్తున్నా హుజూరాబాద్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన నాయకుడు మాత్రం ఆడబిడ్డల సంక్షేమాన్ని పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఇంటికి దీపం ఇల్లాలని, ఆమె బాగుంటేనే సమాజం బాగుంటుందనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని చెప్పారు. హుజూరాబాద్‌లోని సాయిరూప ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం మాజీమంత్రి బస్వరాజు సారయ్యతో కలిసి మెప్మా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాలకు ప్రభుత్వం రూ.95 లక్షల బకాయి నిధులు విడుదల చేయగా, ఇందుకు సంబంధించిన చెక్కులను మంత్రి సంఘాల సభ్యులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు మహిళలు నానా అగచాట్లు పడ్డారని, చిన్నచిన్న అవసరాల కోసం తీసుకున్న అప్పులు తీర్చలేక ఆస్తులు అమ్ముకునే వారని గుర్తు చేశారు.

ఇలాంటి దయనీయస్థితిని గమనించే ఉద్యమ నేత కేసీఆర్, రాష్ట్రం రాగానే అతివల ఆత్మగౌరవం పెంపునకు అనేక సంక్షేమ పథకాలకు అంకురార్పణ చేశారని చెప్పారు.

పథకాల ఫలాలను మహిళల పేరిటే అందిస్తున్నారని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడాలేనివిధంగా సమైక్య సంఘాలకు రూ.10 లక్షల వడ్డీలేని రుణాలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. స్థానిక నాయకత్వం వైఫల్యం కారణంగానే బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు. ప్రజా సమస్యలను గాలికొదిలి అధికారాన్ని అడ్డంపెట్టుకొని ఆస్తులను సంపాదించుకున్నాడని నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా స్థానిక మహిళా సంఘాల సమాఖ్య శాశ్వత భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసిన గంగుల, మరో రెండు రోజుల్లో స్థలాన్ని గుర్తించి భూమిపూజ చేస్తామని హామీ ఇచ్చారు. ఇంకా మిగిలిపోయిన బకాయిలు రూ.83 లక్షలనూ అతి త్వరలోనే మహిళా సంఘాలకు అందిస్తామని భరోసానిచ్చారు. ఈ దిశగా సత్వరమే చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### పరిగెతో పోల్చినవారికి గుణపాఠం నేర్పాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పరిగెతో పోల్చిన వారికి తగిన గుణపాఠం చెప్పాలని మంత్రి పిలుపునిచ్చారు. సమైక్య రాష్ట్రంలో ప్రతిపక్షాల నాయకులు అసెంబ్లీలో ఎండిన వరి కంకులు, కాలిన మోటర్లతో నిరసనలు తెలిపినా పట్టించుకోలేదన్నారు. కానీ, సీఎం కేసీఆర్ నేడు రైతాంగానికి 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నదని, రైతుబంధు, రైతుబీమా లాంటి అనేక పథకాలను అమలు చేస్తున్నదని చెప్పారు. ఈ పథకాలపై అడ్డదిడ్డంగా మాట్లాడుతున్న బీజేపీ నాయకులు వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడంలేదో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ఇష్టారీతిగా విమర్శలు చేస్తున్న వారిని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. హుజూరాబాద్ అభివృద్ధికే పట్టంగడతారని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ.. మహిళా పొదుపు సంఘాలపై ప్రభుత్వానికి ఎంతో విశ్వాసం ఉందన్నారు. మెప్మా సభ్యులకు ఒకే డ్రెస్‌కోడ్ ఉండేలా మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. మహిళలు ఎలాంటి సమస్యలున్నా మంత్రులు, సంబంధిత ఎమ్మెల్యేలు, అధికారులను కలిస్తే పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. కాగా, 110 మంది మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు నూతన అప్రాన్లను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే ప్రసన్నరాణి, మెప్మా పీడీ రవీందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, మెప్మా ప్రతినిధులు ఏపీడీ శ్రీవాణి, సీఎల్‌ఆర్‌పీలు, ఆర్‌పీలు, కౌన్సిలర్లు కే రమాదేవి, కే లావణ్య, టీ శ్రీనివాస్‌గౌడ్, ఎం.కుమార్, టీ సదానందం, టీ రాజేంద్రప్రసాద్, ఎం.రమేశ్, పెద్దఎత్తున మహిళలు, స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## పరిధిని పెంచి రూపొందించిన 122ఎంఎం క్యాలిబర్ రాకెట్‌ను విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీవో

న్యూఢిల్లీ, జూన్ 26:దేశీయంగా అభివృద్ధి చేసిన 122ఎంఎం క్యాలిబర్ రాకెట్ పరిధిని పెంచి రూపొందించిన కొత్త వెర్షన్లను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని సమీకృత ప్రయోగ కేంద్రం (ఐటీఆర్)లో, మల్టీ బారెల్ రాకెట్ లాంఛర్ (ఎంబీఆర్ఎల్) ద్వారా కొత్త వెర్షన్లను ప్రయోగించింది. నాలుగు రకాల 122ఎంఎం రాకెట్లను ప్రయోగించగా, ఈ మిషన్ లక్ష్యాలను అవన్నీ అందుకున్నాయి. భారత సైన్యం కోసం ఈ రాకెట్లను డీఆర్‌డీవో తయారు చేసింది. 40 కి.మీ. దూరంలోని లక్ష్యాలను వీటితో ఛేదించవచ్చు.

టెలిమెట్రీ, రాడార్, ఎలక్ట్రో ఆప్టికల్ ట్రాకింగ్ వ్యవస్థ సహా ఐటీఆర్, ప్రూఫ్ అండ్ ఎక్స్‌పెరిమెంటల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (పీఎక్స్ఈ) ఏర్పాటు చేసిన పరికరాల ద్వారా రాకెట్ల గమనాన్ని పరిశీలించారు.

పుణెలోని ఆయుధ పరిశోధన, అభివృద్ధి సంస్థ (ఈఆర్‌డీఈ), హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ లాబొరేటరీ (హెచ్ఈఎంఆర్ఎల్) సంయుక్తంగా ఈ రాకెట్ వ్యవస్థను రూపొందించగా, నాగ్‌పూర్‌కు చెందిన ఎకనామిక్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్ ఉత్పత్తి సహకారాన్ని అందించింది. కొత్తగా రూపొందించిన రాకెట్లను, ప్రస్తుతమున్న 122ఎంఎం గ్రాడ్ రాకెట్ల స్థానంలో ప్రవేశపెడతారు.

122ఎంఎం క్యాలిబర్ రాకెట్ల ప్రయోగం విజయవంతంపై రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. డీఆర్‌డీవోను, పరిశ్రమను అభినందించారు. ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న సిబ్బందిని డీఆర్‌డీవో ఛైర్మన్ డా. జి.సతీష్ రెడ్డి ప్రశంసించారు.

## తెలంగాణ ప్రజల అదృష్టం

**–ఆడపిల్లల తల్లుల కళ్లల్లో మాటలకందని ఆనందం కన్పిస్తోంది**

**కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర**

ఖమ్మం, జూన్ 24: పేదల కష్టసుఖాలు తెలిసిన కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండడం తెలంగాణ ప్రజల అదృష్టమని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. మండలానికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను స్థానిక సప్తపది ఫంక్షన్ హాల్లో గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ ఆడపిల్లల పెళ్లిళ్లు చేసేందుకు పేద కుటుంబాలు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావన్నారు. అలాంటి బాధలను చూసిన సీఎం కేసీఆర్.. వాటిని దూరం చేసేందుకే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. చెక్కులు అందుకున్న ఆడ పిల్లల్ల తల్లుల కళ్లల్లో మాటలకందని ఆనందం కన్పిస్తోందని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఇటీవల సత్తుపల్లి నియోజకవర్గంలోని 7,500 మంది లబ్ధిదారులకు రూ.70 కోట్లు మంజూరయ్యాయని, ఒక్క నియోజకవర్గంలోని పేదలకే ఇంత పెద్ద మొత్తంలో లబ్ధి చేకూరితే రాష్ట్రంలోని పేదలందరికీ ఎంత మొత్తంలో మేలు కలిగి ఉంటుందో అర్థమవుతోందని అన్నారు. జూలై 1 నుంచి పల్లెప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఆర్డీవో సూర్యనారాయణ, జడ్పీటీసీల ఫోరం జిల్లా కన్వీనర్ చెక్కిలాల మోహన్‌రావు, కల్లూరు ఏఎంసీ ఛైర్మన్ చెక్కిలాల లక్ష్మణ్‌రావు, తహసీల్దార్ రమాదేవి, సర్పంచ్‌లసంఘం మండల అధ్యక్షుడు మందడపు అశోక్‌కుమార్, సర్పంచ్‌లు తావూనాయక్, పంతులి, సీడీసీ ఛైర్మన్ భూపాల్ రెడ్డి, సొసైటీ ఛైర్మన్ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ సత్యావతి, నాయకులు వినీల్, సురేశ్‌బాబు, తాతారావు, ప్రసాద్, రవి, నాగదాసు, అప్పారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్ననాటి స్నేహితులను కలుసుకున్న ప్రొటెం ఛైర్మన్ భూపాల్ రెడ్డి



సంగారెడ్డి , జూన్ 25:: నిత్యం ప్రభుత్వ కార్యక్రమలతో బిజీగా ఉండే తెలంగాణ శాసన మండలి ప్రొటెం ఛైర్మన్ వీ భూపాల్ రెడ్డి తన చిన్ననాటి స్నేహితులను శనివారం కలుసుకున్నారు. సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరు పట్టణంలో, చిట్కుల్ గ్రామంలో తన చిన్ననాటి స్నేహితులను కలిసి ఆప్యాయంగా పలుకరించారు. ప్రొటెం ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటగా తమ గ్రామానికి వచ్చిన భూపాల్ రెడ్డికి స్నేహితులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. చిన్ననాటి విషయాలను గుర్తు చేసుకుంటు దోస్తులతో ఆప్యాయంగా మాట్లాడిన భూపాల్ రెడ్డి ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి రాంరెడ్డి, నర్సింగ రావు, మాజీ జడ్పీటీసీ జైపాల్ తదితరులు పాల్గొన్నారు.




## దళితులకు ముఖ్యమంత్రి స్లోగన్ ఏమైంది?: ఉత్తమ్



హైదరాబాద్ , జూన్ 26:దళితులకు ముఖ్యమంత్రి స్లోగన్ ఏమైందని సీఎం కేసీఆర్‌ను టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం గాంధీభవన్ లో నిర్వహించిన దళిత ఆవేదన దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌పై ఉత్తమ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దళిత మహిళ లాక్ అప్ డెత్ ఘటన సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉందన్నారు. ఈ ఘటన జరిగిన వారం తర్వాత కాంగ్రెస్ నేతలు చెబితే సీఎం స్పందించారని మండిపడ్డారు. దళిత ఎం పవర్ మెంట్ కాదు.. గతంలో దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితులకు ఇస్తానన్న మూడు ఎకరాల భూమి హామీ ఏమైందని ప్రశ్నించారు. సీఎం సొంత నియోజకవర్గం గజ్వేల్ లో, సిరిసిల్లలో దళితులపై దాడులు జరిగితే దిక్కు లేదని ఉత్తమ్ విమర్శించారు.

## గర్భిణులకు కోవిడ్ టీకా ఇవ్వాల్సిందే: ఐసీఎంఆర్




న్యూఢిల్లీ, జూన్ 26:కోవిడ్ టీకాలను గర్భిణులకు ఇవ్వవచ్చు అని కేంద్ర ఆరోగ్యశాఖ తన మార్గదర్శకాల్లో సూచించిందని, ప్రెగ్నెంట్ మహిళల్లో వ్యాక్సినేషన్ ఉపయోగపడుతుందని, వారికి టీకాలు ఇవ్వాల్సిందే అని ఐసీఎంఆర్ డైరక్టర్ జనరల్ డాక్టర్ బలరామ్ భార్గవ్ తెలిపారు.

సార్స్ సీవోవీ2 వేరియంట్లు అయిన ఆల్ఫా, బీటా, గామా, డెల్టాలపై కోవీషీల్డ్, కోవాగ్జిన్ టీకాలు పనిచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 12 దేశాల్లో డెల్టాప్లస్ కేసులు ఉన్నట్లు ఆయన చెప్పారు. ఇండియాలో 50 కేసులను గుర్తించినట్లు తెలిపారు. డెల్టా ప్లస్ వైరస్‌ను ఐసోలేట్ చేసి కల్చర్ చేస్తున్నామని, మిగితా వేరియంట్లకు చేసిన పరీక్షలనే చేస్తున్నామని, ల్యాబ్‌ల్లో వ్యాక్సిన్ సమర్థతను పరీక్షిస్తున్నామని, మరో పది రోజుల్లో ఫలితాలు వస్తాయని బలరామ్ భార్గవ్ తెలిపారు.

ప్రస్తుతం ప్రపంచంలో ఒకే ఒక దేశం పిల్లలకు వ్యాక్సిన్ ఇస్తున్నట్లు ఐసీఎంఆర్ చీఫ్ తెలిపారు. అయితే మరి చిన్న పిల్లలకు వ్యాక్సిన్ అవసరమా అన్నది ఇంకా తెలియని ప్రశ్నగానే మిగిలిపోయిందన్నారు. డేటా పూర్తిగా తెలియనంత వరకు.. పిల్లలకు వ్యాక్సిన్ ఇవ్వలేమని బలరామ్ భార్గవ్ వెల్లడించారు. అయినా తాము ఓ చిన్నపాటి స్టడీ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. 2 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు పిల్లల్లో పరీక్షిస్తున్నట్లు తెలిపారు. వాటి ఫలితాలు సెప్టెంబర్ వరకు వస్తాయన్నారు. కానీ పిల్లల వ్యాక్సినేషన్‌పై అంతర్జాతీయంగా చర్చలు జరుగుతున్నాయని, వారికి వ్యాక్సిన్ ఇవ్వాలా వద్దా అన్న కోణంలో సంప్రదింపులు కొనసాగుతున్నట్లు ఆయన చెప్పారు. మధ్యప్రదేశ్‌లో డెల్టా పాజిటివ్ వచ్చిన ఇద్దరు మరణించినట్లు ప్రభుత్వం పేర్కొన్నది.

## జలదోపిడీకి సహకరించిన వాళ్లా కేసీఆర్ ను విమర్శించేది?

హైదరాబాద్ , జూన్ 26:ఏపీ ప్రభుత్వం చేపడుతున్న రాయలసీమ ఎత్తిపోతల పథకం అక్రమమని తెలంగాణ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. ఈ అక్రమ ప్రాజెక్టును అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ అవతరణే పెద్ద కుట్ర అని, తెలంగాణ నీటిని దోచుకునేందుకే ఆంధ్రప్రదేశ్ ని ఏర్పాటు చేశారని విమర్శించారు. ఏపీ ఏర్పాటు తర్వాత తెలంగాణ ప్రాజెక్టులను పట్టించుకోలేదన్నారు. ఏపీ అవతరణతో మహబూబ్ నగర్ జిల్లాలకు తీరని అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఏపీ ప్రాజెక్టులు అక్రమమని, తెలంగాణ నిర్మిస్తున్నవి సక్రమ ప్రాజెక్టులని తెలిపారు. ఆనాడు జలదోపిడీకి సహకరించినవాళ్లు ఇప్పుడు సీఎం కేసీఆర్ పై విమర్శలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. విభజన చట్టం ప్రకారం ఏపీ ప్రభుత్వం కొత్త ప్రాజెక్టును మొదలుపెట్టాలంటే కేంద్రం అనుమతిని తీసుకోవాలని నిరంజన్ రెడ్డి గుర్తు చేశారు.



## పేద దేశాలకు వ్యాక్సిన్లు ఇవ్వండి.. వేడుకున్న డబ్ల్యూహెచ్‌వో చీఫ్



జెనీవా, జూన్ 26:: పేద దేశాలకు కరోనా వ్యాక్సిన్లు ఇవ్వాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ టెడ్రోస్ అథనమ్ గెబ్రియాసిస్ ప్రపంచ దేశాలను కోరారు. వ్యాక్సినేట్ అయిన సంపన్న దేశాలు మళ్లీ తెరుచుకుంటున్నాయని, కోవిడ్‌తో రిస్క్ లేనటువంటి యువతకు కూడా వ్యాక్సిన్లు ఆ దేశాలు ఇస్తున్నాయని ఆయన అన్నారు. కానీ అతి పేద దేశాలకు ఇంకా వ్యాక్సిన్లు అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ టీకాల పంపిణీలో ప్రపంచవ్యాప్తంగా విఫలమైనట్లు టెడ్రోస్ తెలిపారు. ఆఫ్రికాలో పరిస్థితి దారుణంగా ఉందని, గత వారంతో పోలిస్తే ప్రస్తుతం ఇన్‌ఫెక్షన్లు, మరణాలు 40 శాతం పెరిగాయని, పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉందని, డెల్టా వేరియంట్ వైరస్ ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్నట్లు టెడ్రోస్ చెప్పారు. వ్యాక్సినేషన్ విషయంలో ఓ ప్రపంచంగా మన విఫలమవుతున్నాయని ఆయన అన్నారు.

జెనీవాలో మీడియాతో మాట్లాడిన టెడ్రోస్.. అతి పేద దేశాలకు వ్యాక్సిన్లను సరఫరా చేయడంలో కొన్ని అగ్రదేశాలు విఫలమైనట్లు ఆయన చెప్పారు. అయితే ఏయే దేశాలు నిర్లిప్తంగా ఉన్నాయన్న విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. గతంలో ఆఫ్రికా దేశాలు ఎయిడ్స్ సంక్షోభ సమయంలో సరైన రీతిలో వ్యవహరించలేదన్న అంశాలను పక్కనపెట్టాలన్నారు. ప్రస్తుతం వ్యాక్సిన్ల సరఫరా సమస్యగా మారిందని, ఆఫ్రికా దేశాలకు వ్యాక్సిన్లు ఇవ్వాలంటూ ఆయన వేడుకున్నారు. ఉన్నవాళ్లు, లేనివాళ్ల మధ్య తేడా పెరుగుతోందని, ఇది అసమానతలను ఎత్తి చూపుతోందన్నారు.

వ్యాక్సిన్లు మీరు వాడరన్న ఉద్దేశంతో ఆఫ్రికా దేశాలకు వాటిని సరఫరా చేయకపోవడం అది బ్రిటీష్ పాలన నాటి మైండ్‌సెట్‌ను చూపుతుందని, మహమ్మారి వేళ ఇది సరైన ప్రవర్తన కాదు అని డబ్ల్యూహెచ్‌వో టాప్ ఎమర్జెన్సీ నిపుణుడు మైక్ ర్యాన్ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నేతృత్వంలో కోవాక్స్ కార్యక్రమంలో భాగంగా పేద దేశాలకు వ్యాక్సిన్ సరఫరా అవుతోంది. అయితే ఇండియా వ్యాక్సిన్ల సరఫరా నిలిపివేయడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

ఆస్ట్రాజెనికా, సీరం, జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీల నుంచి ఈ నెలలో ఒక్క డోసు టీకా కూడా అందలేదని డబ్ల్యూహెచ్‌వో సీనియర్ అడ్వైజర్ బ్రూస్ అల్వార్డ్ తెలిపారు.

## కత్తి మహేష్ పరిస్థితి మరింత విషమం !!

హైదరాబాద్ , జూన్ 26:సినీ నటుడు కత్తి మహేష్ రోడ్డు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. అయితే చెన్నై కలకత్తా రహదారిపై తెల్లవారుజామున ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. అయితే ఈ ప్రమాదంలో గాయపడ్డ మహేష్ పరిస్థితి మరింత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం స్పెషల్ ఐసోలేషన్ లో వెంటిలేటర్ పై మహేష్ కు చికిత్స అందిస్తున్నారు వైద్యులు.

నెల్లూరులోని మెడికవర్ కార్పొరేట్ ఆస్పత్రిలో మహేష్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. మరికొన్ని గంటల తర్వాత హెల్త్ బులిటెన్ విడుదల చేస్తామని హాస్పిటల్ యాజమాన్యం చెబుతోంది. ప్రమాద సమయంలో మహేష్ తో పాటు కార్ డ్రైవర్ కూడా ఉన్నట్లు సమాచారం. డ్రైవర్ ఇచ్చిన సమాచారం తో కత్తి మహేష్ గా పోలీసులు గుర్తించారని తెలుస్తోంది. ఇక ఇప్పటికే ఆసుపత్రికి కత్తి మహేష్ బంధువులు స్నేహితులు చేరుకుని ఆయన ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు.

## నౌకాయానంలో దేశాన్ని అగ్రగామిగా నిలపాలి: వెంకయ్యనాయుడు




విశాఖపట్టణం, జూన్ 26: : భారతదేశ ఆర్థిక వ్యవస్థలో నౌకాయాన రంగానిది కీలక పాత్ర అని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. భారత నౌకాయాన రంగాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలిపేందుకు మరింత కృషి జరగాల్సిన అవసరం ఉన్నదని ఆయన సూచించారు. విశాఖపట్నం పర్యటనలో ఉన్న ఉపరాష్ట్రపతిని పోర్టు ఛైర్మన్ కే రామ్మోహన్ రావు, ఇతర అధికారులు కలిసి పోర్టు పురోగతికి సంబంధించిన వివిధ అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. 103 ఎకరాల్లో రూ.406 కోట్లతో ఫ్రీ ట్రేడ్ అండ్ వేర్‌హౌజింగ్ జోన్ (ఎఫ్‌టీడబ్ల్యూజెడ్) ఏర్పాటుచేయనున్న విషయాన్ని వివరించారు. ట్రస్టు సాధిస్తున్న పురోగతిని ఉపరాష్ట్రపతి అభినందించారు.

ప్రపంచ వ్యూహాత్మక నౌకాయాన మార్గంలోనే భారతదేశం ఉండటం, దీనికి తోడు మన దేశానికి 7,517 కిలోమీటర్ల మేర తీరప్రాంతం ఉండటం, 200కు పైగా భారీ, చిన్న తరహా నౌకాశ్రయాలుండటం విశేషమని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. భారతదేశం ప్రాచీన కాలంలోనూ బలమైన నౌకాయాన వ్యవస్థను కలిగి ఉండేదన్న విషయాన్ని గుర్తుచేశారు. చోళ, కళింగ రాజుల వ్యాపార స్ఫూర్తితో నౌకాయాన రంగానికి పునర్వైభవం తీసుకురావాలన్నారు. భారతదేశంలో పోర్టుల ఆధారిత అభివృద్ధిని విస్తృతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'సాగర్‌మాల' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంతో 504 ప్రాజెక్టుల ద్వారా అభివృద్ధి పరుగులు పెడుతున్నదని చెప్పారు.

2015–16 నుంచి 2019–20 వరకు కార్గో రవాణా విషయంలో విశాఖపట్టణం సాధించిన ప్రగతిని ప్రస్తావించిన ఉపరాష్ట్రపతి.. కరోనా మహమ్మారి కారణంగా కాస్త ఇబ్బందులు తలెత్తాయని, త్వరలోనే అన్నీ సర్దుకుని మళ్లీ విశాఖపట్టణం పోర్టు ప్రగతిపథాన పయనిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. విశాఖపట్టణం పోర్టులో సుస్థిరాభివృద్ధి కోసం ప్రపంచ స్థాయి మౌలికవసతుల కల్పన, పోర్టు ఆధారిత అభివృద్ధి, డిజిటైజేషన్ వ్యవస్థతోపాటు వివిధ పర్యావరణ పరిరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పోర్టు ట్రస్టు ఛైర్మన్ కే రామ్మోహన్ రావు, డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే, సీవీఓ ప్రదీప్ కుమార్ తోపాలు పలు విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కొత్తగా 1,028 కరోనా కేసులు

హైదరాబాద్ , జూన్ 26: తెలంగాణ రాష్ట్రంలోకరోనా పాజిటివ్ కేసుల తీవ్రత తగ్గుముఖం పట్టింది. రాష్ట్రంలో కొత్తగా 1,028 కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా, 9 మంది మరణించారు. గడిచిన 24 గంటల్లో 1,489 మంది ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి అయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుతం 15,054 కరోనా కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఇవాళ ఒక్కరోజే 1,18,427 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. తెలంగాణలో ఇప్పటి వరకు 6.19 లక్షల మందికి కరోనా నిర్ధారణ కాగా, 6.01 లక్షల మంది ఈ మహమ్మారి నుంచి కోలుకున్నారు.

## ఉప ఎన్నిక కోసం రాయలసీమ జలాలపై డ్రామా!




హైదరాబాద్ , జూన్ 26:రాయలసీమ ఎత్తిపోతల పథకం తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు రాజేస్తోంది. తమ జలాలను ఏపీ ప్రభుత్వం దోచుకుంటోందని, అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తోందని తెలంగాణ మంత్రులు ఆరోపిస్తుంటే.. నిబంధనల మేరకు తాము జలాలను వాడుకుంటున్నామని ఏపీ మంత్రులు చెబుతున్నారు. తెలంగాణ నేతలు విమర్శలపై ఏపీ బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. తెలంగాణ మంత్రులు, టీఆర్ఎస్ పార్టీ నేతలు అనవసర వివాదాన్ని సృష్టిస్తున్నారని మండిపడ్డారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల నేపథ్యంలో రెండు రాష్ట్రాల్లోని అధికార పార్టీలు ఈ నాటకంలో భాగస్వాములయ్యాయని విష్ణు ఆరోపించారు. రెండు పార్టీలు తెలంగాణలో జరిగే ఉప ఎన్నికల కోసం రాయలసీమ జలాలపై ఆడుతున్న డ్రామా అని వ్యాఖ్యానించారు.

తెలంగాణలో అనుమతులు లేకుండానే ఎన్నో ప్రాజెక్టులు కడుతున్నారని? వాటికి తెలంగాణ ప్రభుత్వం ఏం సమాధానం చెపుతుందని విష్ణు ప్రశ్నించారు. పాలమూరు ఎత్తిపోతలు , దిండి ప్రాజెక్టు ఎవరు అనుమతులు తీసుకుని నిర్మాణం చేస్తున్నారో వివరించగలరా మంత్రిగారు ? అంటూ నిలదీశారు. రాజకీయాల కోసం లేని వివాదాలను సృష్టిస్తారని, కేంద్రం పరిష్కరించాలంటారని విమర్శించారు. రెండు ప్రభుత్వాలు బీజేపీపై అనవసర విమర్శలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఈ నెల 28న ఏపీ బీజేపీ రాష్ట్ర కమిటీ సమావేశం కానుందని, ఈ సమావేశంలో అన్ని విషయాలను చర్చిస్తామని చెప్పారు. ఆ తర్వాత ఓ ప్రతినిధి బృందం ఢిల్లీకి వెళ్లి, కేంద్ర మంత్రులను కలిసి, అన్ని అంశాలను వివరిస్తుందని విష్ణు తెలిపారు.

## ఏపీలో కొత్తగా 4147 కరోనా కేసులు

అమరావతి, జూన్ 26:ఏపీలో కరోనా కేసులు అదే స్థాయిలో నమోదవుతున్నాయి. తాజాగా గడిచిన 24 గంటల్లో కొత్తగా మొత్తం 96,121మందికి కరోనా పరీక్షలు చేయగా 4,147మందికి పాజిటివ్ గా నిర్ధారణ అయ్యింది. అలాగే మరోవైపు కరోనా కారణంగా చికిత్స పొందుతూ మరో 38 మంది మృతి చెందారు. అలాగే 24 గంటల్లో 5,773మంది కరోనా నుంచి కొలుకున్నారు.

తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 1,97,61,984కి చేరింది. అలాగే యాక్టివ్ కేసుల సంఖ్య 46,126కి చేరింది. ఇక డిశ్చార్జ్ కేసుల సంఖ్య 18,14,035కి చేరింది. మొత్తం కరోనా కారణంగా 12,566 మంది మృతి చెందారు.

# స్మార్ట్ సిటీస్ అవార్డ్స్-2020' జాబితాలో తెలంగాణ నగరాలకు దక్కని చోటు

## (తాజాగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 'స్మార్ట్ సిటీస్ అవార్డులు-2020' జాబితా ఆధారంగా)

కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి శాఖ 'స్మార్ట్ సిటీస్ మిషన్' తాజాగా విడుదల చేసిన 100 స్మార్ట్ మరియు 26 ఇతర నగరాల ప్రగతి విశ్లేషణ ఆధారంగా పలు రంగాల్లో 'స్మార్ట్ సిటీస్ అవార్డ్స్-2020' జాబితాను విడుదల చేసింది. అన్ని రంగాల్లో అత్యుత్తమ ప్రగతి ప్రదర్శించిన ఇండోర్, సూరత్ మహానగరాలు ఉమ్మడిగా 'ఫస్ట్ బెస్ట్ సిటీస్'గా అవార్డులకు ఎంపికైనాయి. కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఛండీగర్ నగరం ఉత్తమ సిటీగా అవార్డు పొందింది. దేశ వ్యాప్తంగా 100 స్మార్ట్ సిటీలు, 26 ఇతర నగరాల ప్రగతి నివేదికలు, సర్వేలు చేసి అంతిమ జాబితాను 25 జూన్ 2021న విడుదల చేశారు. స్మార్ట్ నగరాల్లో '4-స్టార్ రేటింగ్' పొందిన 9 నగరాల్లో సూరత్, ఇండోర్, అహ్మదాబాద్, పూనె, విజయవాడ, రాజ్‌కోట్, విశాఖపట్నం, పింప్రీ-చించ్వాడ్ మరియు వడోదరలు చోటు దక్కించుకున్నాయి. స్మార్ట్ సిటీస్ లీడర్‌షిప్ అవార్డును అహ్మదాబాద్, వారణాసి, రాంచీలు గెలుచుకున్నాయి. అన్నిరంగాల్లో అత్యుత్తమ ప్రగతి కనబరిచిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం 'ఫస్ట్ బెస్ట్ స్టేట్' అవార్డుకు ఎంపికైంది. ఉత్తమ రాష్ట్రాల జాబితాలో తరువాత స్థానాల్లో మధ్యప్రదేశ్, తమిళనాడులు చోటు దక్కించుకున్నాయి. యుపీ రాష్ట్ర ప్రభుత్వం స్వతహాగా 7 (మీరట్, ఫిరోజాబాద్, గోరఖ్‌పూర్, మథురా-బృందావన్, సరహన్‌పూర్, గాజియాబాద్, అయోధ్య) నగరాలను స్మార్ట్ సిటీస్‌గా అభివృద్ధి చేయడానికి ముందుకు రావడం సంతోషదా యకమని నివేదిక తెలియజేస్తున్నది. స్మార్ట్ సిటీ మిషన్ ప్రారంభించి 6 ఏండ్లు పూర్తి అయిన వేళ ఈ అవార్డులు విడుదల చేశామని మంత్రిత్వశాఖ వెల్లడించింది. స్మార్ట్ సిటీస్ అవార్డులు-2021 రూపొందించుటలో పలు అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. సాంఘీక అంశాలు, నగర పాలన, సంస్కృతి/నాగరికత, నగర పర్యావరణం, పారిశుధ్యం, ఆర్థిక వ్యవస్థ, పర్యావరణహిత నిర్మా ణాలు, రక్షిత నీరు, సుస్థిరాభివృద్ధి వ్యాపార నమూన, పట్టణ రవాణ, వినూత్న ఆలో చనలు, కోవిడ్-19 వినూత్న ఆలోచనలు లాంటి వర్గాల్లో 126 నగరాల ప్రగతిని విశ్లేషించి ఆయారంగాల్లో అవార్డులు ప్రకటించారు.

**సాంఘీక అంశాలు (సోషియల్ ఆస్పెక్ట్స్):**
1. తిరుపతి (పాఠశాలల నిర్వహణ)
2. భువనేశ్వర్ (సోషల్లీ స్మార్ట్)
3. తుముకూర్

**(డిజిటల్ లైబ్రరీలు)**

**నగర పాలన (గవర్నెన్స్):**
1. వడోదర (జిఐయస్)
2. థానే (డిజి థానే)
3. భువనేశ్వర్ (యంఈ యాప్)

సంస్కృతి/నాగరికత (కల్చర్):
(ఇండోర్, చండీఘర్ ఉమ్మడిగా గెలిచాయి)
1. ఇండోర్ (వారసత్వ పరిరక్షణ)
1. ఛండీఘర్ (పాలన భవనాలు, వారసత్వ కట్టడాల ప్రాజెక్టులు)
3. గ్వాలియర్ (డిజిటల్ మ్యూజియమ్)

నగర పర్యావరణం (అర్బన్ ఎన్విరాన్‌మెంట్):
(భోపాల్, చెన్నై సంయుక్తంగా గెలుచుకున్నాయి)
1. భోపాల్ (క్లీన్ ఎనర్జీ)
1. చెన్నై (నీటి నిల్వల పరిరక్షణ)
3. తిరుపతి (పునరుత్పత్తి శక్తి వనరులు)

పారిశుధ్యం (సానిటేషన్):
(తిరుపతి, ఇండోర్ సంయుక్తంగా గెలుచుకున్నాయి)
1. తిరుపతి (బయోరీమిడియేషన్, బయోమైనింగ్)
1. ఇండోర్ (నగర వ్యర్థాల నిర్వహణ)
3. సూరత్ (వ్యర్థ నీటి నిర్వహణ)

**ఆర్థిక వ్యవస్థ (ఎకానమీ):**
1. ఇండోర్ (కార్బన్ క్రెడిట్ ఫైనాన్సింగ్ వ్యవస్థ)
2. తిరుపతి (స్థానిక ఆర్థిక వ్యవస్థలు), ఆగ్రా (సూక్ష్మ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు) సంయుక్తంగా

**పర్యావరణహిత నిర్మాణాలు (బిల్ట్ ఎన్విరాన్‌మెంట్):**
1. ఇండోర్ (ఛప్పన్ దుకన్)
2. సూరత్ (కెనాల్ కారిడార్)
3. ఎరోడ్ (మైక్రో-కంపోస్ట్ కేంద్రాలు)

**రక్షిత నీరు (వాటర్):**
(డెహ్రాడూన్, వారణాసి ఉమ్మడిగా గెలుచుకున్నాయి)
1. డెహ్రాడూన్ (స్మార్ట్ వాటర్ మీటర్ల ఏర్పాటు)
1. వారణాసి (నదీ పరివాహక ప్రాంతాల నిర్వహణ)
3. సూరత్ (సమగ్ర నీటి సరఫరా వ్యవస్థ)

**సుస్థిరాభివృద్ధి వ్యాపార నమూన:**
1. అగర్తలా ఐసిసిసి

నగర రవాణ వ్యవస్థ (అర్బన్ మొబిలిటీ):
1. ఔరంగాబాద్ (మజీ స్మార్ట్ బస్)
2. సూరత్ (డైనమిక్ బస్ సర్వీస్)
3. అహ్మదాబాద్ (ఆటోమాటిక్ టికెటింగ్, మానవరహిత పార్కింగ్)

**వినూత్న ఆలోచనల అవార్డు (ఇన్నొవేషన్ ఐడియా):**
1. ఇండోర్ (కార్బన్ క్రెడిట్ ఫైనాన్సింగ్ వ్యవస్థ)

కోవిడ్-19 వినూత్న ఆలోచనలు (కోవిడ్ ఇన్నొవేషన్):
1. కళ్యాణ్-దోంబివలి, వారణాసి సంయుక్త విజేతలుగా నిలిచాయి.

స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల ప్రగతి వివరాలు: కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ వివరాల ప్రకారం స్మార్ట్ సిటీ మిషన్ పరిధిలోన 100 స్మార్ట్ నగరాల్లో 1.78 లక్షల కోట్లతో 5,924 ప్రాజెక్టులు టెండరింగ్ అయ్యాయని, నేడు 1.46 లక్షల కోట్ల విలువైన 5,236 ప్రాజెక్టుల పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయని, 45,080 కోట్ల విలువైన 2,665 ప్రాజెక్టులు పూర్తి అయ్యాయని తెలిపింది. దేశంలోని 70 స్మార్ట్ మహానగరాల్లో కోవిడ్-19 నియంత్రణ చర్యలతో ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు (ఐసిసిసి) సమర్థవంతంగా పని చేస్తున్నాయని తెలిపారు. దేశ నగరాల్లో 310 స్మార్ట్ రోడ్లు పూర్తి కాగా, 459 రోడ్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

**తెలుగు రాష్ట్రాల స్మార్ట్ సిటి అవార్డులు:**

స్మార్ట్ సిటీస్ అవార్డుల జాబితాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తిరుపతి, విశాఖపట్నం, విజయవాడలు చోటు దక్కించుకోవడం సంతోషదాయకం. తెలంగాణకు చెందిన రెండు స్మార్ట్ సిటీలు వరంగల్, కరీంనగర్ మరియు ఇతర మహానగరంగా హైదరాబాద్ జాబితాలో కనిపించక పోవడం విచారకరం. సాంఘీక అంశాలు మరియు పారిశుధ్యం అనబడే రెండు విభాగాల్లో తిరుపతి ప్రథమ స్థానంలో నిలవడం, ఆర్థిక వ్యవస్థ అనే ఒక విభాగంలో ద్వితీయ, నగర పర్యావరణం అనే మరో విభాగంలో తృతీయ స్థానాల్లో నిలిచి ఆంధ్రకు గర్వకారణంగా నిలిచింది. 4-స్టార్ రేటింగ్ పొందిన 9 నగరాల్లో విశాఖపట్నం, విజయవాడలు చోటు దక్కించుకోవడం హర్షదాయకం. తిరుమల వెంకన్న కోవెల ముందున్న తిరుపతి మహానగరానికి పలు స్మార్ట్ సిటీ అవార్డులు దక్కించుకోవడం తెలుగు వారందరికి గర్వకారణం. తెలంగాణలోని హైదరాబాద్, వరంగల్ మరియు కరీంనగర్‌లు రాబోయే రోజుల్లో ఉత్తమ ప్రగతి ఫలితాలను పొందాలని కోరుకుందాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఉపాధి హామీ పథకం కింద రూ. 1,432 కోట్లు మంజూరు

హైదరాబాద్ , జూన్ 26:రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ. 1,432 కోట్లు విడుదల చేసినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామాల్లో కూలీలకు ఉపాధి నిమిత్తం నిధులను మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 13కోట్ల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇప్పటికే 9 కోట్ల పనిదినాలను కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. గత సీజన్లో ఈ సమయంలో 17 లక్షల 50 వేల కూలీలు పని చేస్తే, ఈ సీజన్లో 35 లక్షల 50 వేల మంది ఉపాధి కూలీలు పని చేస్తున్నారని మంత్రి తెలిపారు.

రాష్ట్రంలో 32 జిల్లాల్లోని 540 మండలాల్లో కరోనా నిబంధనలతో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయని మంత్రి స్పష్టం చేశారు. కరోనా నిబంధనల మేరకు కూలీలు కూడా మాస్కులు ధరించి పనులకు హాజరుకావాలని, చేతులను తరచుగా శానిటేషన్ చేసుకుని పనులు చేసేటప్పుడు, ఇంటికి వెళ్లేటప్పుడు సామాజిక దూరం పాటించాలని మంత్రి కోరారు.

# మృతుడి కుటుంబానికి పరామర్శ..



రాజన్న సిరిసిల్ల, జూన్ 26(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన గడ్డం బాపురెడ్డి అనే వ్యక్తి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా మృతుని కుటుంబ సభ్యులను శనివారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు, ఈ సందర్భంగా ఏనుగు మనోహర్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ఇచ్చారు, ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మల్యాల గంగ నర్సయ్య, ఉప సర్పంచ్ కాసారపు గంగాధర్ గౌడ్, వార్డు సభ్యులు గడ్డం శ్రీనివాసరెడ్డి,నాయకులు కటకం మల్లేశం, గౌతం రాజు, ఉపేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, తీపి రెడ్డి మనోహర్ రెడ్డి, కుమ్మరి దయాకర్ తదితరులు పాల్గొన్నారు,

# మెట్టినింట ఘోరం : నవ వధువుపై భర్త, మరుదుల సామూహిక లైంగిక దాడి

బదౌన్, , జూన్ 26: ఉత్తర్ ప్రదేశ్‌లోని బుదౌన్‌లో దారుణం జరిగింది. కొత్తగా పెండ్లయిన మహిళ(20)పై భర్త, ఇద్దరు మరుదులు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. కట్నం విషయంలో భర్త కుటుంబ సభ్యులు కొందరు ఆమెను వేధించినట్టు ఆరోపణలు న్నాయి. కొత్వాలి సహస్వన్ ప్రాంతానికి చెందిన మహిళక ఉస్మాన్‌పూర్ ప్రాంతంలోని వ్యక్తితో ఈనెల 22న వివాహమైంది. ఆపై అత్తింట అడుగుపెట్టగానే భర్త కుటుంబ సభ్యులు ఆమెను కట్నం తీసుకురమ్మని వేధింపులకు గురిచేశారు. ఈ క్రమంలో భర్త ఇద్దరు మరుదులు తనపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారని మహిళ ఆరోపించారు.

తనను శారీరకంగా చిత్రహింసలకు గురిచేయడమే కాకుండా తన ప్రైవేట్ భాగాలను కాల్చి నరకం చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. కూల్‌డ్రింక్‌లో విషం కలిపి తనను చంపేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. అత్తింటి వేధింపులపై సమాచారం అందుకున్న బాధితురాలి తండ్రి పోలీసు బృందంతో కలిసి వెళ్లి ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు. మహిళ ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాధితురాలి భర్తతో సహా నేరానికి పాల్పడిన ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. మహిళ భర్తను అరెస్ట్ చేశామని జిల్లా ఎస్పీ సంకల్ప్ శర్మ వెల్లడించారు.

# నెలలోపు మీటర్ రీడింగ్ తీసేట్లు ఏజెన్సీపై చర్యలు తీసుకోండి

## -విద్యుత్ ఎస్ఈకి బిజెపి మైనార్టీ మోర్చా వినతి



కరీంనగర్ జూన్ 26(నేటినిజం ప్రతినిధి): విద్యుత్ శాఖ పరిధిలోని ప్రయివేటు ఏజెన్సీల ఇష్టారాజ్యంతో సామాన్య ప్రజల జేబులు గుల్ల అవుతున్నాయని, నెల లోపు మీటర్ రీడింగ్ తీసేట్లు ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలని బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ×మహమ్మద్ జమాల్× ఆధ్వర్యంలో ఎన్పిడిసిఎల్ ఎస్ఈ మాధవరావును కలిసి ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నెలకు వందల్లో వచ్చే విద్యుత్ చార్జీలు, వేలల్లో వస్తున్నాయని, ప్రయివేటు ఏజెన్సీల నిర్లక్ష్యంతో వినియోగదారులకు తీరని నష్టం జరుగుతుందని ఆరోపించారు. ఇదే విషయమై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోకుండా మిన్నుకుండి పోతున్నారని విమర్శించారు. తక్షణమే ఎస్ఈ స్పందించి నెలవారీ మీటర్ రీడింగ్ సకాలంలో తీసేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సర్దార్ బల్బీర్ సింగ్, జిల్లా అధికార ప్రతినిధి మిర్జా అసదుల్లా బేగ్, నాయకులు జస్పాల్ సింగ్, మహమ్మద్ సయాద్, ఫైజె చిస్తీ తదితరులు ఉన్నారు.

# కరోనా పంజా.. టాప్ మావోయిస్టు నేతల మరణం.. వైరస్ బారిన మరికొందరు..!

హైదరాబాద్ , జూన్ 26: కరోనా మహమ్మారి ఎవరినీ వదిలి పెట్టడం లేదు. విప్లవ సాధన కోసం అడవులను క్షేత్రాలుగా చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తున్న మావోయిస్టులు కూడా మహమ్మారి బారిన పడ్డారు. ఇప్పటివరకు భద్రతా దళాలతో పోరాడే మావోయిస్టులు.. ఇప్పుడు కోవిడ్-19తోనూ పోరాడాల్సిన దుస్థితిలో ఉన్నారు.

తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లోని అడవుల్లో విస్తరించి ఉన్న మావోయిస్టులు ఇంతకుముందు చికున్‌గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోయేవారు. తాజాగా ప్రాణాంతక కరోనా మహమ్మారి విసిరిన పంజాకు అగ్రశ్రేణి మావోయిస్టు నేతలు ప్రాణాలు కోల్పోయారని నక్సలైట్ల వ్యతిరేక ఇంటెలిజెన్స్ వింగ్.. స్పెషల్ ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి.

మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి యాప నారాయణ అలియాస్ హరిభూషణ్, నాయకురాలు సిద్దబోయిన సారక్క అలియాస్ భారతక్కలు కోవిడ్-19 బారిన పడి ప్రాణాలు కోల్పోయారు.

కరోనా సెకండ్ వేవ్ వల్ల కనీసం ఎనిమిది మంది మావోయిస్టు నాయకులు, కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారని భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ సునీల్ దత్ తెలిపారు. మరో 15-20 మంది తీవ్రంగా కరోనా బారిన పడ్డారని పోలీస్ వర్గాల కథనం. కరోనా భయంతోనే మరికొందరు పార్టీని వీడారని సమాచారం.

నకాలంలో వైద్య చికిత్స అందకపోవడం, పాడైన ఆహారం తినడం, పాము కాటు వంటి ఘటనలతోపాటు ప్రకృతిలో వైవిధ్య భరితమైన మార్పుల వల్ల మావోయిస్టుల ఆరోగ్యం దెబ్బ తింటున్నది.

# కష్టకాలంలో ఉపాధి కల్పిస్తున్నఫెడరల్ బ్యాంక్?

తిరువనంతపురం, జూన్ 26: కరోనా సెకెండ్ వేవ్ కారణంగా అనేక రంగాలు కుదేలయాయి. దీంతో లక్షలాది మంది ఉపాధి లేక రోడ్డున పడ్డారు. అనేక మంది ఉద్యోగాలు, ఉపాధిని కోల్పోయిన ప్రస్తుత పరిస్థితుల్లో ఫెడరల్ బ్యాంక్ సరికొత్త చర్యలు తీసుకుంది. వందల మంది నిరుద్యోగు లకు ఉపాధిని కల్పించడానికి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నది.కేరళలో ఈ ప్రయోగాన్ని చేపట్టింది. దేశంలో నెలకొన్న తాజా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొత్తగా పార్ట్‌టైమ్ ఉద్యోగాలను సృష్టించింది ఫెడరల్ బ్యాంక్.నిరుద్యోగులకు వాటిని కేటాయించింది. ఇప్పటిదాకా 400 మందికి పైగా యువతకు ఉపాధిని కల్పించినట్లు ప్రకటించింది. కేరళ వ్యాప్తంగా ఉన్న తమ శాఖా కార్యాలయాల్లో వారిని నియమించినట్లు తెలిపింది. పార్ట్‌టైమ్ ఉద్యోగాల కింద 400 మందికి పైగా ఉపాధిని కల్పించామని, వారందరినీ కోవిడ్ వార్డెన్స్‌గా హోదా కల్పించినట్లు ఫెడరల్ బ్యాంక్ చీఫ్ హ్యూమన్ రిసోర్స్ పర్సన్ అజిత్ కుమార్ కేకే తెలిపారు.

# సోనూసూద్ మరో ముందడుగు.. ఈసారి వ్యాక్సినేషన్ లక్ష్యంగా..

న్యూఢిల్లీ, జూన్ 26: బాలీవుడ్ నటుడు సోనూ సూద్ కరోనా విపత్తు వేళ తన పెద్ద మనసును చాటుకుంటూనే ఉన్నాడు. ఇన్నాళ్లూ కరోనా వల్ల కష్టాలు పడిన వారికి అండగా నిలిచిన ఈ రియల్ హీరో.. ఇప్పుడు వ్యాక్సినేషన్‌పై దృష్టి సారించాడు. ముఖ్యంగా గ్రామీణ భారతానికి వ్యాక్సినేషన్‌లో అండగా ఉండటానికి ఓ కొత్త కార్యక్రమం ప్రారంభించాడు. దాని పేరు ఇలాఖీఇఉ. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాక్సిన్ల కోసం గ్రామీణులు రిజిస్టర్ చేసుకోవడంలో సాయం చేయడానికి వలంటీర్లు ఉంటారు.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యాక్సిన్ల సమస్యలను పరిష్కరించడానికే తాను ఈ ఇలాఖీఇఉ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు సోనూ ఓ ప్రకటనలో చెప్పాడు. ఈ ఇలాఖీఇఉను కేంద్ర ఆరోగ్య శాఖ ఆమోదించింది. ఇదొక అప్లికేషన్ సర్వీస్ ప్రొవైడర్‌గా గుర్తించింది. ఓ స్మార్ట్‌ఫోన్, 4జీ నెట్‌వర్క్ ఉన్న ఎవరైనా లిలిలి.ఇనీలతీవణ.తినిలో రిజిస్టర్ చేసుకొని వలంటీర్‌గా మారొచ్చని సోనూ సూద్ చెప్పాడు.

వ్యాక్సిన్ రిజిస్ట్రేషన్‌లో ఇబ్బంది పడుతున్న వారికి ఈ వలంటీర్లు సాయం చేస్తారని తెలిపాడు. ఈ మహమ్మారిని జయించాలంటే వ్యాక్సినేషనే మన ముందున్న మార్గమని అతడు స్పష్టం చేశాడు. క్షేత్రస్థాయిలో గ్రామీణ భారతం కొవిడ్ వ్యాక్సిన్ రిజిస్ట్రేషన్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించిన తర్వాతే ఈ ఇనీలతీవణను క్రియేట్ చేసినట్లు సోనూ చెప్పాడు.

# వ్యాక్సిన్ వేయించుకున్నవారికి ఉచిత హెయిర్ కట్!

పట్నా, జూన్ 26: : మహమ్మారి కట్టడికి వ్యాక్సినేషన్ ప్రక్రియ ముమ్మరంగా సాగేందుకు ఎవరికి తోచిన రీతిలో వారు సహకరిస్తున్నారు. వ్యాక్సిన్ వేయించుకున్నవారికి ఇప్పటికే పలు సంస్థలు ఆకర్షణీయ బహుమతులు, రాయితీలు, కూపన్లు అందిస్తుండగా తాజాగా బిహార్‌లోని దర్భంగా జిల్లాలో ఓ సెలూన్ యజమాని కొవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న వారికి ఉచిత హెయిర్ కట్‌తో పాటు, ఫ్రీగా షేవింగ్ చేస్తున్నాడు. దర్భంగా నగరంలోని బైటా చౌక్‌లో ఉన్న ఈ సెలూన్ యజమాని శంభు కుమార్ ఠాకూర్ చొరవను పలువురు ప్రశంసిస్తున్నారు.

జిల్లాలో వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రోత్సహించేందుకు తాను ఇలా ఉచిత సర్వీసును ఆఫర్ చేస్తున్నానని ఠాకూర్ చెప్పుకొచ్చారు. వ్యాక్సిన్ తీసుకునే సమయంలో సెల్ఫీ తీసుకున్న వారితో పాటు, వ్యాక్సినేషన్ సర్టిఫికెట్ చూపిన వారికి ఉచితంగా సర్వీసు చేస్తున్నానని అన్నారు. ప్రభుత్వం వ్యాక్సినేషన్ ప్రక్రియపై ప్రచారం చేస్తుండగా తాము కూడా తమకు తోచిన రీతిలో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని నిర్ణయించుకున్నామన్నారు. తాము ఇప్పటికే 200 మందికి పైగా క్లైంట్లకు ఉచిత సేవలు అందించామని ఠాకూర్ తెలిపారు. సెలూన్ వెలుపల ఉచిత ఆఫర్‌ను తెలిపే బోర్డును సైతం ప్రదర్శిస్తున్నామని చెప్పారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి- జడ్పిటిసి నాగం కుమార్



రాజన్న సిరిసిల్ల, జూన్ 26(నేటినిజం ప్రతినిధి): గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని చందుర్తి జెడ్ పిటిసి నాగం కుమార్ అన్నారు, చందుర్తి మండలం మర్రిగడ్డ, చందుర్తి, ఆశిరెడ్డిపల్లి, బండపల్లి గ్రామాలలో జిల్లా పరిషత్ నిధుల ద్వారా బోర్లు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని ఆయన అన్నారు, చందుర్తి లో నాయి బ్రాహ్మణ సంఘం, మర్రిగడ్డలో గౌడ సంఘం, బండపల్లి లో ఎస్సీ కమ్యూనిటీ భవనం వద్ద, ఆశిరెడ్డిపల్లి లో యాదవ సంఘం వద్ద బోర్ లు వేసి మోటార్లను బిగించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధుల ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం ప్రత్యేక కృషి చేస్తామన్నారు, గ్రామాల్లో అన్ని కుల సంఘాల వారు ఐక్యమత్యంగా ఉంటూ అభివృద్ధికి సహకరించాలన్నారు, దశలవారీగా అన్ని గ్రామాలలో జిల్లా పరిషత్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో మర్రిగడ్డ సర్పంచ్ జలపతి, ఉప సర్పంచి వెంకటరెడ్డి,జోగాపూర్ ఎంపిటిసి మ్యాకల గణేష్ నాయకులు రమేష్, శేఖర్, ముత్తయ్య,కుల సభ్యులు పాల్గొన్నారు,

# నిర్లక్ష్యానికి నిలువుటద్దం

## చిందరవందరగా పడి ఉన్నా సూచిక బోర్డులు




రాజన్న సిరిసిల్ల, జూన్ 26(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల కోసం ఏర్పాటు చేయాల్సిన సూచిక బోర్డు ఆలయ అధికారులు ఉద్యోగుల నిర్లక్ష్యంతో ఇలా క్యూలైన్లలో చిందరవందరగా పడి ఉన్నాయి.వాటిని వాటి స్థానాల్లో ఏర్పాటు చేయడంలో ఆలయ అధికారులు, ఉద్యోగుల అలసత్వం నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా కనిపిస్తున్నది.వెంటనే సూచిక బోర్డులు యదాస్థానంలో ఏర్పాటు చేసి భక్తుల మనోభావాలను గౌరవించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు గడప కిషోర్ రావు డిమాండ్ చేశారు

# బారికేడ్లను తొలగించి చండీగఢ్‌లోకి ప్రవేశించిన రైతులు

చండీగఢ్, జూన్ 26: వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన నిరసన ఏడు నెలలకు చేరిన నేపథ్యంలో పంజాబ్, హర్యానా రాజ్‌భవన్ల మార్చ్‌కు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుతో పంజాబ్, హర్యానా రైతులు శనివారం వేల సంఖ్యలో చండీగఢ్‌కు తరలివెళ్లారు. కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్‌లోకి వారు ప్రవేశించకుండా మొహాలీ-చండీగఢ్ సరిహద్దులో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను పంజాబ్ రైతులు తొలగించారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా కొంత గందరగోళం నెలకొన్నది. అయితే చండీగఢ్‌లోకి ప్రవేశించిన పంజాబ్ రైతులను రాజ్‌భవన్ వైపు వెళ్లకుండా రెండు కిలో మీటర్ల దూరంలో పోలీసులు అడ్డుకున్నారు.

మరి కొన్ని చోట్ల నీటి ఫిరంగులతో రైతులను చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ రైతులు ట్రాక్టర్ల సహాయంతో చండీగఢ్‌లోకి ప్రవేశించారు. పంజాబ్ గవర్నర్ అధికారి ఒకరు అక్కడకు వచ్చి రైతుల వినతి పత్రాలను తీసుకున్నారు. దీంతో చాలా మంది రైతులు వెనక్కి తగ్గారు. హర్యానా రైతులను చండీగఢ్ సరిహద్దులోని పంచకుల వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో హర్యానా గవర్నర్ కార్యాలయం అధికారి రైతుల వినతి పత్రాన్ని అక్కడ స్వీకరించారు. కాగా ఈ పరిణామాలతో చండీగఢ్‌లో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

# ఈటలపై బీజేపీ నాయకుల సంచలన వ్యాఖ్యలు

కరీంనగర్, జూన్ 26: బీజేపీలో చేరిన ఈటల రాజేందర్‌పై ఆ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు సంచలన వ్యాఖ్యలు చేశారు. మండల, గ్రామ కార్యకర్తలను పట్టించుకోకుండా.. కనీస మర్యాద ఇవ్వకుండా ఈటల రాజేందర్ ప్రవర్తిస్తున్నారని ఇల్లందకుంట బీజేపీ మండల అధ్యక్షులు నన్నబోయిన రవియాదవ్ ధ్వజమెత్తారు. ఈటల రాజేందర్ తన అనుచరులతో మండలాల్లో పర్యటిస్తూ బీజేపీని నమ్ముకుని పని చేస్తున్న నాయకుల ఆత్మగౌరవం దెబ్బతినేలా ప్రవర్తిస్తున్నారని కోపోద్రిక్తులయ్యారు. ఆస్తులను కాపాడుకునేందుకు ఈటల బీజేపీలో చేరారని పేర్కొన్నారు.






Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.